

కొత్త 'కిక్కు'



- జిల్లాలో ప్రారంభమైన నూతన మద్యం వ్యాపారం
- ఇళ్ల వద్ద షాపులు వద్దంటూ పలుచోట్ల ఆందోళనలు
- కొన్నిచోట్ల ఇంకా అందుబాటులోకి రాని బ్రాండెడ్ మద్యం
- పాత రేట్లకే మద్యం విక్రయాలతో మందుబాబుల్లో నిరాశ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల మద్యం షాపుల ఏర్పాటుకు స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో వ్యాపార సంస్థను ప్రారంభించాలనుకునేవారు ప్రత్యామ్నాయ ఏర్పాటుపై దృష్టి సారించారు. పాత రేట్లకే మద్యం విక్రయాలు చేపట్టడంతో తొలిరోజు మద్యం ప్రియులకు నిరాశే ఎదురైంది. తొలిరోజు నుంచే డిజిటల్ చెల్లింపులు కూడా కొన్నిచోట్ల ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం విక్రయాలను భారీగా చేపట్టడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రజలు రోగాలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ విధానానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 133 మద్యం షాపులకు లక్కీడిప్ ద్వారా వ్యాపారులను నిర్ధయించారు. వారంతా ధరావత్తు సొమ్ములను ఎక్సైజ్‌శాఖ అధికారులకు చెల్లించడంతో అధికారులు లైసెన్సులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటుకు వ్యాపారులు హడావిడి నిర్ణయాలను తీసుకున్నారు. ఇళ్ల మధ్య మద్యం షాపులు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల ప్రజలు తొలిరోజు ఆందోళనకు దిగడంతో ఆ షాపును ప్రారంభించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వ్యాపారులు అన్వేషించారు. ఉదాహరణకు అయినవిల్లి మండలం శానపల్లిలంకలో ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రామస్తులను బుజ్జగించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో వ్యాపారులు ప్రత్యామ్నాయ మార్గం చూశారు. అలాగే కొత్తపేట మండలం అవిడిరేవులోను మద్యం షాపును వ్యతిరేకిస్తూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ తరహా ఆందోళనలు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ప్రారంభమయ్యాయి. అయితే ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం షాపులు ప్రారంభించడానికి వ్యాపారులు కృషి చేయాలని ఒత్తిడి పెంచుతున్నారు. ఇదిలా ఉండగా తొలిరోజు లిక్కరు గోడౌన్‌లలో ఉన్న పాత సరుకునే షాపులకు విక్రయించడంతో దాన్నే షాపుల్లో అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే మద్యం సరుకుపై భారీగా పన్నులు విధించడంతో వ్యాపారులకు ఆందోళనకరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వ్యాపారులు సిండికేట్లుగా మారి మద్యం విక్రయాలు చేపట్టడంతో రాజకీయాలు కూడా రసవత్తరంగా మారుతున్నాయి. అయితే హడావిడిగా షాపులు చూసుకుని మద్యం వ్యాపార సంస్థలను ప్రారంభించాల్సి రావడంతో వ్యాపారులు బ్యానరు కట్టి ఏదో షాపులో మద్యం బాటిళ్ల పెట్టి విక్రయాలు చేపట్టడం కనిపించింది. మద్యం ప్రియులకు కొన్నిచోట్ల బ్రాండెడ్ కంపెనీల మద్యం ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో వారిలో నిరుత్సాహం అలుముకుంది. కొన్నిచోట్ల డిజిటల్ లావాదేవీల ద్వారా మద్యం విక్రయాలు చేపట్టడానికి చర్యలు చేపట్టారు. రానున్న రోజుల్లో మద్యం షాపులను వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల్లో తిరుగుబాటులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. రాజకీయ నాయకులు కూడా ఈ ఉద్యమాలకు ఊపిరి పోయనున్నారు.

అయినవిల్లి (మం) శానపల్లిలంక మద్యం షాపు వద్ద వివాదం



సీతాఫలం ఎంతో ప్రియం

అంబాజీపేట, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పేదల ఆపిల్‌గా, మధుర ఫలంగా పేరున్న సీతాఫలం... ఇప్పుడు ప్రియమైంది.. చిన్న పిల్లలు మొదలు వృద్ధుల వరకు అందరూ ఇష్టపడే సీతాఫలాలు ఈ ఏడాది మార్కెట్‌లో అక్కడక్కడ కనిపిస్తున్నాయి. జూన్ నుంచి నవంబర్ వరకూ విరగకాసే సీతాఫలాలు ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతల వల్ల దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది.. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సీతాఫలాలు విక్రయాలు జోరుగా జరుగుతాయి. గతంలో వర్షాలు లేకపోవడంతో దిగుబడి తగ్గడమే కాకుండా మార్కెట్‌లోకి ఆలస్యంగా వచ్చినట్లు వ్యాపారులు అంటున్నారు.

పెరిగిన ధరలు..

సీతాఫలాల దిగుబడి తగ్గడంతో విక్రయిదారులు వాటి ధరను అమాంతం పెంచేశారు. సీజన్ పండ్లు కావడంతో ఎక్కువ మంది తినేందుకు ఇష్టపడుతుండడంతో డిమాండ్ కూడా పెరిగింది. మార్కెట్‌లో డజన్ సైజును బట్టి రూ. 250 నుంచి 400 వరకూ విక్రయిస్తున్నారు. గత ఏడాది ఇదే సమయంలో తక్కువ ధరలు ఉండేవని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో విడిగా కాయలు రూ. 10 నుంచి 20ల వరకూ విక్రయించామని వ్యాపారులు తెలిపారు.

ఆరోగ్య ప్రదాయిని

సీతాఫలాలు రుచికే కాదు ఆరోగ్యపరంగానూ మధురఫలంగా చెబుతారు. వీటిని ఆరగిస్తే అజీర్తి, మలబద్ధకం, రక్తహీనత తదితర సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. సీతాఫలంలో తేమ, విటమిన్ సి అధికంగా ఉంటాయి. జీర్ణ సంబంధిత సమస్యలు తొలగిపోతాయి. విత్తనాలను ఎండబెట్టి, పొడిచేసి వాటిని జుట్టుకు పట్టిస్తే చుండ్రును నివారించవచ్చు. శరీర రక్షణకు కావాల్సిన పోషక విలువలు పుష్కలంగా ఉండటంతో ఎంతో మేలు జరుగుతుంది.

100 గ్రాముల్లో పోషకాలు ఇవీ

- చక్కెర శాతం 19 నుంచి 29 గ్రాములు
- 104 కిలో కేలరీల శక్తి
- 1.6 గ్రాముల ప్రొటీన్లు
- 0.4 గ్రాముల కొవ్వు పదార్థాలు
- 23.05 గ్రాముల కార్బొహైడ్రేట్లు
- 3.1 గ్రాముల ఫైబర్
- 17 మిల్లీ గ్రాముల కాల్షియం
- 4.37 మిల్లీ గ్రాముల పాస్పరస్
- 4.37 మిల్లీ గ్రాముల ఐరన్
- 37 మిల్లీ గ్రాముల సీ విటమిన్



జాతీయ రహదారి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో భవానీ

మామిడికుదురు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్వాసితుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని అమలాపురం ఆర్డీవో భవానీ తెలిపారు. ఆర్డీవో పాశర్లపూడిలో జాతీయ రహదారి నిర్వాసితులతో చర్చించి మామిడికుదురులోని తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. జాతీయ రహదారిలో ఇళ్లు, భవనాలు కోల్పోతున్న బాధితుల అభ్యంతరాలు తెలుసుకోవడానికి పది బృందాలు ఏర్పాటు చేశామని, వారి అభ్యంతరాలను ఆయా బృందాలకు తెలియచేయాలని తెలిపారు. దీనిపై బాధితులు మాట్లాడుతూ తమ భూములకు సెంటు లెక్కన పరిహారం చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారని, అలా కాకుండా చదరపు గజాల్లో చెల్లించాలని, భవనం కొంత పార్టు పడినా పూర్తిగా పరిహారం చెల్లించాలని, ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని, 2017 నోటిఫికేషన్‌లో పడిన ఇళ్లు, భూములకు 2020 నోటిఫికేషన్ ప్రకారం చెల్లించే రేట్ల మాదిరిగానే ఇవ్వాలని తదితర డిమాండ్లను ఆర్డీవో దృష్టిలో పెట్టారు. ఇంకా అప్పట్లో తీసుకున్న విస్తీర్ణ కొలతల్లో తేడాలున్నాయని, వాటిని సరిచేసి పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని ఆర్డీవో దృష్టికి తెచ్చారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో బాధితుల డిమాండ్లు పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో శాంతకుమారి, తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచారి, ఆర్ఐ ఎండీ ఆలీ, వీఆర్వోలు నారాయణ, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



కోరంగిలో విదేశీ అతిథుల సందడి..

- అభయారణ్యానికి వేలాదిగా రాక
- ఆరంభమైన సీజన్
- 5 వేల కిలోమీటర్లు పయనం
- ఐదు దేశాల నుంచి వేడర్స్ పక్షులు
- ఆయా దేశాల్లో మంచు కారణం
- గుంపులు..గుంపులుగా సందడి
- అక్టోబరు టు ఫిబ్రవరి ఇక్కడే మకాం
- చంబల్ నుంచీ ఇండియన్ స్కిమ్మర్
- 108 జాతులకు చెందిన పక్షులు
- 40 వేలకుపైగా కనువిందు
- 2025 జనవరిలో విదేశీ పక్షుల గణన

ఎక్కడ చైనా.. ఎక్కడ నైజీరియా.. తదితర 8 దేశాలు మ్యాప్‌లో కూడా గుర్తించడం కష్టమే.. నోరు లేని మూగజీవాలు మాత్రం ఆయా దేశాల నుంచి ప్రతి ఏడాది అక్టోబరులో వలస వచ్చేస్తాయి.. ఐదు నెలల పాటు ఇక్కటే ఉంటాయి.. ఒక్కటి కాదు.. వందలు కాదు.. 41 వేలు పైనే 108 జాతులకు చెందిన పక్షులు వస్తాయి. కనువిందు చేస్తాయి.. ఒకసారి ఆ విదేశీ పక్షులను చూడాలని ఉందా.. అయితే ఒకసారి కాకినాడ చెంత ఉన్న కోరంగి అభయారణ్యానికి వెళ్లాల్సిందే.. ఇంకెందుకు ఆలస్యం పదండి.. చూసొద్దాం..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి) ప్రకృతి అందచందాలకు నెలవైన కోరంగి అభయారణ్యానికి అప్పుడే విదేశీ అతిథుల తాకిడి మొదలైంది. వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ గుంపులు గుంపులుగా వచ్చేశాయి.. ఈ అతిథులు ఇక్కడ ఏకంగా ఐదు నెలలు మకాం వేస్తాయి.. ఇలా వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ ఇక్కడకు వచ్చేది ఎందుకో తెలుసా.. కేవలం ఆహారం కోసం.. పక్షులు ఉండే దేశంలో వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పుల కారణంగా ప్రతి ఏడాది అక్టోబరు నాటికి వేల కిలోమీటర్లు ఎగురుకుంటూ కాకినాడలోని కోరంగి అభయారణ్యానికి అతిథులుగా వస్తాయి..రష్యా,చైనా, సైబీరియా, మంగోలియా దేశాల నుంచి వందల పక్షులు అభయారణ్యానికి చేరుకున్నాయి. అంతే కాదండోయ్ మధ్యప్రదేశ్,రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న చంబల్ నుంచి ఇండియన్ స్కిమ్మర్ పక్షులు తాజాగా కోరంగికి చేపల కోసం విచ్చేశాయి.

ఎన్నెన్ని అందాలో...

చూడ్డానికి అందంగా, గుబురుగా...దట్టంగా కనిపించే మడ అడవులు దేశంలో కాకినాడకే ప్రత్యేకం. నదీ జలాలు సముద్రంలో కలిసేచోట చిత్తడినేలల్లో పెరగడమే వీటి ప్రత్యేకత. సాధారణంగా ఉప్పునీటిలో చెట్లు పెరగవు. కానీ కేవలం అందు లోనే పెరిగి, ఊత వేర్లతో ఒకదానికొకటి పెనవేసుకుపోయే చెట్లు,పొదల సముదాయమే మడ అడ వులు. ప్రపంచవ్యాప్తంగా 18 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో ఇవి వ్యాపించగా ఎక్కువగా ఇండోనేషియా,బ్రెజిల్,ఇండియా, బంగ్లాదేశ్‌లో ఇవి ఉన్నా యి. రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో 331.5 చదరపు కిలోమీటర్లలో ఇవి విస్తరించగా, కృష్ణా పరీవాహక ప్రాంతంలో 250 చదరపు కిలోమీటర్లు ఉన్నాయి. అత్యధికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరా ల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా కేంద్రం గుర్తించింది. విస్తీర్ణంలో దేశంలో రెండో అతిపెద్ద మడ అడవులు ఇవి. ఉమ్మడి జిల్లాలో ఈ మడ అడవులను మొత్తం తొమ్మిది అభయారణ్యాలుగా గుర్తించారు. ఇందులో కోరంగి అభయారణ్యం అతి పెద్దది. ఇది 42.42 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఆ తర్వాత కోరంగి విస్తరణ (194) భైరవపాలెం (9.71), రాతి కాల్వ 20.43,మాసానితిప్ప (10.89) మట్లతిప్ప (04.45), బలుసుతిప్ప (4.75), కొత్తపాలెం (0.58) కొత్తపాలెం (0.58), కందికుప్ప (38.02) చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ 80 రకాల వృక్షజాతులున్నాయి. కోరంగి అభయారణ్యంలో 24 కుటుంబాలకు చెందిన 35 జాతుల మడ మొక్కలున్నాయి.ఏటా ఎనిమిది దేశాల నుంచి 120 జాతుల విదేశీ,స్వదేశీ వలస పక్షు లు కోరంగికి వస్తాయి. ఏటా అక్టోబర్ నుంచి వివిధ దేశాల పక్షులు రావడం ఆనవాయితీ.. ప్రస్తు తం ఇక్కడకు రష్యా, చైనా, సైబీ రియా,మంగోలియా దేశాల నుంచి వేడర్స్ జాతికి చెంది పక్షులు కొన్ని రోజులుగా వచ్చి విడిది చేస్తున్నాయి. వేడర్స్ పక్షుల్లో మొత్తం 56 జాతులు ఉన్నాయి. ఇవన్నీ గుం పులు గుంపులుగా కోరంగికి వస్తు న్నాయి.గ్రేట్ నాట్, బ్లాక్‌టైల్ గాడ్‌విట్, బ్రోడ్ బిల్డ్ శాండ్ పైపర్, క్రాబ్ ప్లోవర్, గ్రేటర్ ఫ్లెమింగో తదితర జాతులకు చెందిన విదేశీ పక్షులు ఇక్క డకు విడిదిగా మరికొన్ని రోజుల్లో రానున్నాయి.



ఏటా 40 వేల పక్షులు పైనే...

ఏటా అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు ఐదు నెలల పాటు కోరంగికి విదేశీ,స్వదేశీ పక్షుల తాకిడి ఉంటుంది.ఏటా జనవరిలో రెండు రోజుల పాటు కోరింగి అభయారణ్యానికి చెందిన అటవీశాఖ అధికారులు పక్షుల గణాం కాలు సేకరిస్తారు. ఇందుకు పక్షులను గణించే నిపుణులను దేశవ్యాప్తంగా పిలుస్తారు.వీరందరినీ 12 గ్రూపులుగా విభజిస్తారు.ఒక్కో గ్రూపులో ఐదు గురిని ఉంచి రెండు రోజుల పాటు సర్వే చేస్తా రు. వీరంతాఫొటోలు,బైనాక్యులర్స్ ఆధారంగా ఆయా పక్షులు ఏదేశం నుంచి వలస వచ్చా యి? ఎన్ని వచ్చాయి? అనే వివరాలు తయారు చేస్తారు.ఆ తర్వాత పక్షుల సంఖ్యతో కూడిన నివేదికను బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్ఎస్)కు పంపుతారు.దీని ప్రకారం ఈ ఏడాది జనవరిలో కోరంగికి 108 జాతులకు చెందిన 41,131 పక్షులు వచ్చినట్టు లెక్క తేల్చారు. 2017లో 43,718, 2020లో 26,734, 2021లో 34,207, 2022లో 46,546 విదేశీ,స్వదేశీ పక్షులు కోరంగికి వచ్చాయి.ఏటా జనవరిలో కోరంగి అభయారణ్యం,పరిసరాల్లోని 12 ప్రాంతాల్లో సర్వే చేస్తారు.

అక్కడంతా మంచే మంచు...

ఏటా అక్టోబర్ నుంచి రష్యా,చైనా, సైబీరియా, మంగోలియా, ఓమన్, అరబ్ తదితర దేశాల్లో శీతాకాలం ప్రభావంతో విపరీతంగా మంచు కురుస్తుంటుంది. దీని వల్ల అక్కడ పక్షులకు ఆహారం దొరకదు. పచ్చిక బయళ్లు, చెట్లు,అడవులు పూర్తిగా మంచుతో కప్పేసి ఉంటాయి. దీని వల్ల పక్షులకు ఆహార సమస్య ఉంటుంది. దీంతో భూమధ్య రేఖకు దిగువన ఉన్న ఇండియాలోని కోరంగి అభయారణ్యానికి వలస వస్తాయి. ఇలా అయా దేశాల నుంచి దాదాపుగా 4,500 కిలోమీటర్ల నుంచి 5,800 కిలోమీటర్ల దూరం ఎగురుకుంటూ ఇక్కడకు చేరుకుంటాయి. ఇక్కడ కోరంగిలో చిత్తడి వాతావరణం, గుబురుగా ఉండే చెట్లు, తక్కువ ఎత్తులో నీరు ఉండడంతో విదేశీ పక్షులకు ఆహారం సులువుగా దొరుకుతుంది. దీని వల్ల వేలాదిగా ఇక్కడకు వస్తాయి. ఏటా ఇక్కడకు వచ్చే పక్షులు 35 వేల వరకు ఉంటాయి.

చంబల్ నుంచీ వచ్చేస్తున్నాయి..

దేశంలోని చంబల్ ప్రాంతం నుంచీ ఇండియన్ స్కిమ్మర్ పక్షుల తాకిడి ఆరంభమైం ది. ప్రస్తుతం 800 వరకు పక్షులు ఇక్కడకు చేరుకున్నాయి. స్కిమ్మర్ జాతి పక్షులు అధికంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో విస్తరించి ఉన్న అభయారణ్యం నుంచి కోరంగికి వస్తాయి. ఇవన్నీ చంబల్,మహానది ప్రాంతంలో పిల్లలను కంటాయి.అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఆహారం కోసం 1,300 కిలోమీటర్లు ఎగురుకుంటూ కోరంగికి వస్తాయి. వీటిని నది ఊడ్చి పక్షి అంటారు. వీటి కింద దవడ పొడవుగా ఉంటుంది. చిత్తడిగా ఉన్న కోరంగి మడ అడవుల్లో బురదను చీల్చి కిందకు దవడను ఉంచి చేపలను వేటాడి తినడం వీటి ప్రత్యేకత.ఇవికాకుండా స్వదేశీ పక్షులు మరిన్ని వచ్చేనెలలో ఇక్కడకు రానున్నాయి.



పళ్లాలమ్మ ఆలయ అభివృద్ధికి సీఎం చంద్రబాబు హామీ

- ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు
- నిర్మాణ పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధం
- దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక హామీ ఇచ్చినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. సీఎం హామీ మేరకు నిర్మాణ పనులు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధమైందన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు, ఇంజనీర్లతో ఆలయ అభివృద్ధి ప్రతిపాదనలు, అంచనాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 23న ఉపాధి హామీ పనుల గ్రామసభలో భాగంగా సీఎం చంద్రబాబు కొత్తపేట మండలం వానపల్లి గ్రామసభకు హాజరై శ్రీపళ్లాలమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఆలయం వద్ద పార్కు నిర్మాణంతో పాటు పొంగల్ షెడ్లు, ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్లు, స్నానాల గదులు, ఓవర్‌హెడ్ ట్యాంకులతో పాటు తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు, దర్శనానికి విచ్చేసే భక్తుల వసతి నిమిత్తం పది గదుల నిర్మాణం, అంతర్గత రోడ్లు, నివేదన శాల, పార్కింగ్‌తో పాటు వీధి దీపాల ఏర్పాట్లను ప్రతిపాదించామన్నారు. ప్రత్యేకంగా పొంగల్ షెడ్, ప్రహరీ, మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్మాణం కోసం దేవాదాయ ధర్మాదాయశాఖ కామన్ గుడ్ ఫండ్ నుంచి రూ.83 లక్షలు విడుదల చేస్తుందన్నారు. పార్కు నిర్మాణానికి కామన్ గుడ్ ఫండ్ మార్గదర్శకాలకు అనుగుణంగా లేనందున పర్యాటకశాఖ ద్వారా గానీ, ప్రత్యామ్నాయ నిధుల ద్వారా గానీ పనులు చేపడతామన్నారు. జలజీవన్‌మిషన్ ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ఆలయంలో గ్రామదేవత ఆగమం ప్రకారం పూజలు జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో ఎటువంటి వరద ముంపు రాకుండా కాల్వపై రివిట్‌మెంట్ ఎత్తును పెంచడంతో పాటు సరిహద్దుల ఏర్పాటుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పచ్చదనం నింపడానికి విరివిగా మొక్కలు పెంచాలన్నారు. డిసెంబరు నెలాఖరు నాటికి పనులన్నీ పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో దేవదాయశాఖ ఉప కమిషనర్ డీఎల్వీ రమేష్‌బాబు, కార్యనిర్వాహక ఇంజనీర్ టి.దుర్గేష్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మదన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఓడలరేవు వద్ద ఓఎన్జీసీ గేటును తాకుతున్న అలలు

అలల ఉధృతి

అల్లవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం ఓడలరేవు సాగర తీరంలో బుధవారం రాత్రి అలలు ఎగసిపడ్డాయి. ఉధృతంగా ఉవ్వెత్తున ఓఎన్జీసీ ప్లాంట్ గోడను తాకాయి. తీరం వెంబడి అలలు ఉగ్రరూపం దాల్చి తీరం దాటి అలజడి సృష్టించాయి.



ప్రమాదమా.. ఆ తొలి గంటే కీలకం!

నేడు వరల్డ్ ట్రామా డే

జీవితం అనిశ్చితం.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు. అకస్మాత్తుగా ఏదో రోడ్డు ప్రమాదానికో గురై గాయాలు కావచ్చు. అనుకోకుండా మంటలు చెలరేగి చర్మం కాలవచ్చు. హఠాత్తుగా పనిచేస్తున్న పరిశ్రమలోనో లేదా పెద్దవాళ్లు ఏ బాత్‌రూమ్‌లోనో జారిపడిపోతే గాయపడొచ్చు. ఇలా అనుకోకుండా ప్రమాదం జరగడం, ప్రమాదవశాత్తు గాయాలపాలైతే వైద్య పరిభాషలో ట్రామా కేసులుగా పరిగణిస్తారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కోసం ప్రతీ ఏడాదీ అక్టోబరు 17న వరల్డ్ ట్రామా డేగా నిర్వహిస్తుంటారు.



(పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లోనే ట్రామా కేసులెక్కువ. దీనివల్ల తలకు గాయాలు, ఎముకలు విరగడం వంటివి జరుగుతాయి. ప్రతీ ఏటా రోడ్డు ప్రమాదాలకు మన ప్రాంతంలోనే వందలాది మంది మరణిస్తుండగా, వేలాది మంది తీవ్రగాయాలపాలవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే ప్రమాదాలకు సంబంధించి జరిగిన సర్వేల్లో ప్రతి ఆరు సెకండ్లకు ఒక మరణం సంభవిస్తోందని తేలింది. దేశవ్యాప్తంగా కూడా ఏటా 10 లక్షల మంది మృతి చెందడంతోపాటు రెండు కోట్ల మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. యువతలో సంభవించే మరణాల్లో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినవారు అందులో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు వారే ఎక్కువ. యాక్సిడెంట్లలో లేదా పెద్దవయసు కారణంగా తలకు గాయలు, ఎముకలు విరగడాలు, రోడ్డు ప్రమాదాలు ఇతరత్రా ప్రమాదాల్లో తలకు గాయం కావడం మామూలే. పెద్దవయసు వారిలో మజిల్ మాస్ తగ్గడం, కాళ్లలో స్పర్శజ్ఞానం మందగించడం, అకస్మాత్తుగా స్పృహ తప్పడం, అకస్మాత్తుగా బీపీ తగ్గిపోవడం, కొందరిలో పక్షవాతం, పార్కిన్‌సన్స్ డిసీజ్ కారణాలతో పడిపోతే తలకు గాయాలు, ఎముకలు ప్రధానంగా తుంటి ఎముక వంటివి విరగడంలాంటివి జరగవచ్చు.

ప్రమాదాల్లో ముందుగా పరిశీలించాల్సిన లక్షణాలు..

- స్పృహ కోల్పోవడం, ఫిట్స్ రావడం
- రెండు అంతకన్నా ఎక్కువ వాంతులు కావడం, చెవి, ముక్కులోంచి రక్తం రావడం
- ప్రమాదానికి ముందు మొదలుకుని 30 నిముషాలలోపు జరిగిన సంఘటనలు గుర్తులేకపోవడం
- తలకు గాయాలైతే తక్షణ సాయంగా ముందుగా అంబులెన్స్ ద్వారా పారా మెడికల్ లేదా ఎమర్జెన్సీ వైద్య సిబ్బంది నుంచి సహాయం అందాలి.
- ఆసుపత్రికి తీసుకొచ్చాక ఎమర్జెన్సీలోనే చికిత్స ప్రారంభంకావాలి. ఎందుకంటే మెదడుకు జరిగిన నష్టాన్ని మళ్లీ భర్తీ చేయడం కష్టం కాబట్టి చికిత్స త్వరగా అందాలి.
- రక్తస్రావం అవుతుంటే దాన్ని ఆపాలి.

రోడ్డు ప్రమాదాలు.. ప్రథమ చికిత్స

సహాయంకోసం పిలవడం (కాల్ ఫర్ హెల్ప్). దీనివల్ల సమీప హాస్పటల్‌కు బాధితుల్ని వీలైనంత త్వరగా తరలించడానికి వీలవుతుంది. దగ్గర్లోని ఆసుపత్రి వివరాలను అంతకంటే ప్రధానంగా అంబులెన్స్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవడం మంచిది.

తలను కదల్చకుండా ఉంచేలా..

తొలుత తలను కదల్చకుండా (హెడ్ ఇమ్మొబిలైజేషన్) ఉంచాలి. ఎందుకంటే తలకు గాయాలైన సందర్భాల్లో మెడకూ, వెన్నుపూసకు గాయాలైనప్పుడు తలను కదల్చకుండా ఉంచడం వల్ల వెన్నుపూసలకు సంబంధించి అనర్థాలను నివారించినట్లవుతుంది.

రక్తస్రావాన్ని అరికట్టడం..

రక్తస్రావం జరగడం రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయాలకు దారితీసే ప్రధాన అంశం. అందుకే రక్తస్రావాన్ని అరికట్టడం రోడ్డు ప్రమాద చికిత్సలో కీలకమైన అంశం. ముందుగా రక్తస్రావానికి కారణమైన తీవ్ర గాయం ఏదైనా ఉందేమో పరిశీలించాలి. గాయం కనిపిస్తే దానిపై తగినంత ఒత్తిడితో రక్తస్రావం ఆగేలా చేయాలి. శుభ్రమైన గుడ్డ లేదా గాజుగుడ్డను కూడా ఇందుకు ఉపయోగించవచ్చు. గాయంపై శుభ్రమైన గుడ్డతో రెండు చేతులతో ఒత్తిడి కలిగిస్తూ పది నిమిషాలు అలాగే ఉంచాలి. ఒకవేళ పైన చెప్పినట్టు పది నిమిషాలపాటు ఒత్తిపట్టినా రక్తం ఆగకపోతే ఏదైనా గుడ్డతో గాయంపై రక్తం ఆగేందుకు గట్టిగా కట్టుకట్టి అలా ఎంతసేపు కట్టి ఉంచారో వైద్య బృందాలకు తెలియజేయాలి. అయితే ఇలా గట్టిగా ఒత్తిపట్టి ఉంచడమన్నది కాళ్లు లేదా చేతుల విషయంలోనే జరగాలి తప్ప శరీర భాగాల్లోని మిగతా చోట్ల చేయకూడదు.

కంటి గాయాలు..

కంటికి అనేక రకాలుగా గాయాలయ్యే అవకాశముంది. రైతులు పొలాల్లో నడిచే సమయంలో ముళ్ల చెట్లు, తుప్పలు కంటికి కొట్టుకోవడం, ఇటుక, ఇసుక లారీల్లోంచి పార్టికిల్స్ వచ్చి కళ్లల్లో పడడం, రాత్రి ప్రయాణాల్లో పురుగుల కళ్లకు కొట్టుకోవడం వంటి ప్రమాదాలు జరిగి కళ్లు గాయపడవచ్చు. ఇక పిల్లల విషయానికి వస్తే బంతి, షటిల్ కాక్ వేగంగా ఎగిరివచ్చి కంటికి తగలచ్చు. అలాంటప్పుడు ఈ కింది విషయాలను గమనించాలి.

- కన్నునొప్పి, కంటి వాపు
- కంట్లో ఏదైనా పడినట్టు (ఫారిన్ బాడీ) అనిపించడం
- మసగ్గా కనిపించడం, ఏమీ కనిపించక పోవడం

అందించాల్సిన ప్రథమ చికిత్స..

పొలాల్లో మందు పిచికారీ చేస్తున్నప్పుడు కంట్లో పడితే దాని ప్రభావం తగ్గించడానికి నీళ్లతో కంటిని కడగాలి. రోడ్డు ప్రయాణంలో ఫుల్ ఫేస్ హెల్మెట్ వాడాలి. బంతి/షటిల్ కాక్ కళ్లకు తగలగానే వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి. ఒకగ్లాస్ నీళ్లు తీసుకుని కన్ను ముంచి రెప్పలను ఆడిస్తూ ఉండాలి. కొద్దిసేపటికి ఈ నీళ్లను మారుస్తూ ఉండాలి. కంటి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లేలోపు కంటిని నలపకూడదు.

కాలిన గాయాలు - జాగ్రత్తలు..

గాయం కాగానే కంగారు పడకుండా దానిపై నీళ్లు ధారగా పడేలా చూసుకోవాలి. అలాగే కనీసం 10 నిమిషాలపాటు మంట తగ్గేవరకూ కడగాలి. కాలినప్పుడు బట్ట చర్మానికి అంటుకుంటే దాన్ని తీయకూడదు. డాక్టర్ మాత్రమే దాన్ని తొలగిస్తారు. కాలిన గాయాలపై క్లింగ్ ర్యాప్ (తినే పదార్థాలపై కప్పే ట్రాన్స్‌పరెంట్‌తో చుట్టడంగానీ లేదా కప్పడంగానీ చేయాలి).

- గాయాన్నీ కడగడానికి గది ఉష్ణోగ్రతతో ఉన్న నీళ్లనే వాడాలి. ఐస్ వాటర్ వద్దు. కాలిన గాయం మందం మన అరచేయి మందంలో సగానికంటే ఎక్కువగా ఉన్నప్పుడు లేదా రసాయనాల వల్ల కాలిన గాయమైతే బాధితుల్ని వెంటనే డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాలి. గాయాన్ని ఎప్పుడూ రుద్దకూడదు. గాయాలపై పసుపు, పేస్టు నెయ్యి వంటివి రాయకూడదు.



- డాక్టర్ పి.సరిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో, పెద్దాపురం





అల్పపీడనం.. అనంత వర్ణాలు

ఆకాశం ఎన్నెన్నో వర్ణాలతో అలరిస్తోంది. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో సంభవిస్తున్న మార్పులకు అనుగుణంగా నింగి కూడా రకరకాల రంగుల్లో కనిపిస్తోంది. మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వర్షం పడుతుండడంతో ఆకాశం నీలి, బంగారు, పసుపు రంగుల్లోకి క్షణాల్లో మారిపోతోంది. మబ్బుల మాటున ఈ వర్ణరంజితమైన ఆకాశం ఆకర్షణీయంగా దర్శనమిస్తోంది. చిత్రాలు.. బుధవారం కాకినాడ కల్పన సెంటర్ బ్రిడ్జి వద్ద కారు మబ్బుల వలయం.. ఉప్పాడ తీరంలో ఎగిసిపడుతున్న సముద్ర కెరటాల పైన కనువిందైన దృశ్యం. - కాకినాడ/కొత్తపల్లి



వేకువనే నిద్ర లేచి గుడెసె బయట కట్టెల పొయ్యిపై వంట

బతుకులు మారాలి..

అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం సందర్భంగా..

- సంచార జీవనం.. ఇప్పటికీ బుడిగె జంగాల తీరు
- పూట గడవాలంటే ఊరూరా తిరగాల్సిందే
- పందిరి గుడెసెలే వారి భవంతులు

ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు పేద బతుకులకు కొంత ఆసరాగా ఉంటున్నప్పటికీ వారి బతుకు చిత్రాల్ని మాత్రం పూర్తిగా మార్చలేకపోతున్నాయి. దీంతో తమ బతుకు కంటే తమ బిడ్డల బతుకులు కాసింత మేలుగా ఉండాలన్న తపన.. అందుకు వారు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అటువంటి జీవితాలు సమాజంలో మన కళ్ల ముందు ఎన్నో కనిపిస్తుంటాయి. అందులో ఒకరు బుడిగె జంగాలు.

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

రోజూ అభివృద్ధి, సంక్షేమం.. ఈ రెండు మాటలూ వింటూనే ఉంటుంటాం. పాలకులు ఏలోటూ రానివ్వకుండా చూసుకుంటున్నామని గొప్పలు చెప్పడాన్నీ ఆలకిస్తుంటాం. నిజంగా అలాంటి వెలుగే ఉంటే ఇదిగో ఇలా సంచార జీవితంతో బతకాల్సిన అగత్యం ఎందుకొస్తుంది. వీరికి చెట్ల కింద పందిరి గుడెసెలే వారి భవంతులు. వేకువనే నిద్రలేవడం.. కట్టెల పొయ్యిపై చారెడు బియ్యం ఉడకేసుకోవడం... భార్యాభర్తలిద్దరికీ చెరో క్యారేజీ సర్దుకోవడం... రాత్రి మిగిలిన సద్దితినడం. ఊళ్లల్లోకి పరుగులు పెట్టడం. ఇది వారి నిత్య జీవన యాత్ర. పాత సామాన్లు కొనడం, వాటిని తిరిగి అమ్ముకోవడం వచ్చిన ఆ కాస్త లాభంతో పూట గడపుకోవడం వారికి నిత్య కృత్యం. ఇదే వారి జీవితం. వారికంటూ భూమి పుట్రా ఏమి లేదు. నాలుగు గోడల ఇళ్లూ లేవు. బ్యాంకు బాలెన్సులు అంతకంటే ఉండవు. ఒక్కో సీజనులో ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకొంటుంటారు. అందుకే వారిని సంచార జీవులంటారు. కాసింత ఎక్కువ చెట్లున్న ప్రాంతమైతే చల్లగా ఉంటుందని ఆ ప్రదేశాన్ని ఎంపిక చేసుకొని అక్కడే పందిరి గుడెసెలు వేసుకుంటుంటారు. వ్యాపారం చేసే బుడిగె జంగాలది ఒక్కో సీజనులో ఒక్కో ఊరు. దీంతో వయసు పైబడిన వారి తల్లిదండ్రులను వారితో పాటే వారి పిల్లల్ని వారి సొంతూర్లలోనే ఉంచేస్తుంటారు. ఇక ఇక్కడి వ్యాపారంలో వచ్చిన సొమ్ములతో వీళ్లు బతుకుతూ తల్లిదండ్రులకు, పిల్లలకు కూడా పంపిస్తుంటారు. అదే సొమ్ములతో పిల్లల చదువులు కూడా. దీంతో వారి సంతానం తల్లిదండ్రులను వదిలేసి నెలల తరబడి ఉండాల్సిన పరిస్థితి. ఒక్కో నెల సరిగా వ్యాపారం సాగని పక్షంలో పూట గడవని పరిస్థితిని ఎదుర్కొంటుంటారు. ఎన్ని గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నా చివరకు వారి బతుకు ఆసరా కేవలం పాడైన సామాన్లు, పాత న్యూస్ పేపర్లు మాత్రమే. వారిలో కొందరు గొడుగులు, గ్యాస్ పొయ్యిల మరమ్మత్తులు చేస్తుంటారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్న కోడు కొండ గ్రామం నుంచి కొన్ని సంచార బుడిగె జంగాల కుటుంబాలు చింతూరు మండలం చట్టి గ్రామంలో గుడెసెలు వేసుకున్నాయి. తమ పిల్లలను పెద్దవాళ్లకు అప్పగించి జీవనోపాధి కోసం వచ్చినట్టు వారు చెప్పారు. ఆడామగా తేడా లేకుండా అందరూ తలోపనీ చేయడం విశేషం.



ఊరూరా తిరిగి పాత బిందెలు కొనుగోలు చేసి తిరిగి నివాస గుడెసెల వద్దకు చేరుకుంటున్న మహిళ

ఇవే మా బతుకులు

అన్ని రోజులు పాత సామాన్లు దొరకవు. ఆరోజు ఊరంతా తిరిగినా కష్టమే మిగులుతుంది. మా పెద్దలది ఇదే బతుకు మాదీ ఇదే బతుకు. వానకాలమైతే వ్యాపారం సాగక పూట గడవడమే కష్టమవుతుంది. పిల్లలకైనా మంచి బతుకు దొరుకుతుందేనన్న ఆశ మాది.

- నిడుగొండ రామకృష్ణ



పాత వస్తువులను కొనుగోలు చేసుకుని వచ్చిన తర్వాత విడదీస్తున్న దృశ్యం



సంచార జీవితంలో గొడుగులు బాగు చేసే పనిచేస్తున్న దృశ్యం

రాజమండ్రిలో రతన్‌టాటా ఇన్నోవేషన్స్ హబ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రక రాజమహేంద్రవరంలో ప్రముఖ వ్యాపారవేత్త రతన్‌టాటా పేరు మీద రతన్‌టాటా ఇన్నోవేషన్స్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో 5 చోట్ల ఈ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గోదావరి జిల్లాలకు కేంద్రంగా రాజమహేంద్రవరంలో ఒక హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సెంట్రల్ హబ్ అమరావతిలో ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజమహేంద్రవరం అభివృద్ధికి ఈ హబ్ ఎంతో ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

గోదావరి మాతకు మహా నీరాజనం

కొవ్వూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు మహానీరాజనం అందజేశారు. ఆశ్వయుజ కో - జాగరి పౌర్ణమిని పురస్కరించుకుని గోదావరి నీరాజన సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రదోషకాలంలో క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో గోదావరిమాతకు 229వ మాసోత్సవ మహా నీరాజనంలో భాగంగా పూజలు చేశారు. నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో గోదావరిమాతకు అష్టోత్తర శత కుంకుమార్చనలు నిర్వహించి, వివిధ రకాల హరతులతో మహా నీరాజనం నిర్వహించారు. మహిళలు నేతి దీపాలు వెలిగించి నదిలో వదిలారు. కార్యక్రమంలో పట్టణ, పరిసర ప్రాంతాల భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీ

మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వాగ్దానాలను మరచి పట్టభద్రులను, ప్రజలను మోసం చేసిన ప్రభుత్వాలను కౌన్సిల్‌లో తన వాణిని వినిపించేందుకు ఒకరిని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి(స్వతంత్ర అభ్యర్థిగా) దింపుతున్నట్టు అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంతో పాటు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. వాగ్దానాలను నిలబెట్టుకోలేని పక్షంలో ప్రభుత్వాలను రద్దు చేసేలా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాలన్నారు. దళితులపై దాడులు పెరుగుతూనే ఉన్నాయి కాని తగ్గలేదన్నారు. అందుకే నిరుద్యోగులు, దగాపడిన వారి కోసం పట్టభద్రుల ఎమ్మెల్సీకి పోటీకి తన మనిషిని దింపుతున్నానని ఆయన తెలిపారు.



రాజానగరం మండలం వెలుగుబందలో కావడి ఉత్సవంలో అయ్యప్ప భక్తులు

కన్నుల పండువగా కావడి ఉత్సవం

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగుబంద గ్రామంలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప కావడి మహోత్సవం క్రతువు కన్నుల పండుగా నిర్వహించారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు పన్నీరు కావడి, పాల కావడితో గ్రామోత్సవం జరిపార. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం స్వాములకు భిక్ష, సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం అనంతరం అయ్యప్ప స్వామి పడిపూజా కార్యక్రమాలు అయ్యప్ప శరణు ఘోష మధ్య వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తులు బసవా రాంబాబు 18వ పర్యాయం అయ్యప్ప మాలధారణ దీక్షను పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో మండలంలోని అయ్యప్పలతో పాటుగా పరిసర గ్రామాల అయ్యప్ప మాలధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఖుష్బూ మెచ్చిన ఉప్పాడ చీర

న్యూఢిల్లీ ఎగ్జిబిషన్‌లో కొనుగోలు

కొత్తపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న నుంచి దేశ రాజధాని న్యూఢిల్లీలో జరుగుతున్న వస్త్ర ప్రదర్శన, అమ్మకాల్లో భాగంగా సినీ నటి ఖుష్బూ ఉప్పాడలో తయారు చేసిన జాంధానీ చీరలు కొనుగోలు చేశారని ప్రదర్శనలో పాల్గొన్న కాకి గంగాధర్ తెలిపారు. ఇప్పటివరకు చేనేత జాంధానీ చీరలు పేరు వినడమే కాని చూడడం ఇదే ప్రథమం అని ఆమె అన్నారని తెలిపారు. ఉప్పాడ జాంధానీ చీర ధరిస్తే ఆ హూందా వేరేగా ఉంటుందని ఖుష్బూ ప్రశంసించారని గంగాధర్ చెప్పారు.



అమ్మవారి ఊరేగింపులో భాగంగా కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా అమ్మవార్ల ఊరేగింపు

గోకవరం, అక్టోబరు 16: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గోకవరంలో బుధవారం అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. వీరభద్రుని గద్దెలోని కనకదుర్గమ్మను, దేవీచౌక్ సెంటర్‌లో దుర్గామాతను పూలతో అలంకరించి వేర్వేరు రథాలపై ఉంచి గరగ నృత్యాలు, కోలాటం, నవదుర్గ నృత్యాలు, తీన్మార్ వాయిద్యాల మధ్య గ్రామంలో ఘనంగా ఊరేగించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు బారులుతీరారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



సత్యదేవుడికి దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ అధికారి పూజలు

అన్నవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో బుధవారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సేఫ్టీ అధికారి వెంకటరెడ్డి సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనాలు అందజేశారు.

వేదాశీర్వచనం పొందుతున్న రైల్వే సేఫ్టీ అధికారి వెంకటరెడ్డి



పిఠాపురం పాదగయ క్షేత్రంలో హుండీలలో లెక్కించిన డబ్బు

పాదగయలో హుండీల ఆదాయం రూ.46.29లక్షలు

పిఠాపురం, అక్టోబరు 16: కాకినాడజిల్లా పిఠాపురం పట్టణం పాదగయ క్షేత్రంలో హుండీలను బుధవారం తెరిచారు. పాదగయలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లు, దత్తాత్రేయస్వామి సన్నిధిలో, ఇతర ప్రాంతాల్లో ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ.46,28,750ల ఆదాయం లభించింది. 210రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ పి.విశ్వనాథరాజు, దేవదాయశాఖ తనిఖీదారు వి.ఫణికుమార్, దేవస్థానం, చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకుల సిబ్బంది, శ్రీవారి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఐజీ అశోక్‌కుమార్

కాకినాడలో ఏలూరు రేంజ్ ఐజీ వార్షిక తనిఖీలు

కాకినాడ క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు,దర్యాప్తు, కేసుల పురోగతి, పెండింగ్ కేసుల వ్యవహారం తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దన్ని పారదర్శకతతో, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సిబ్బంది దైనందిన జీవితంలో ఎటువంటి అనారోగ్యం దరిచేరకుండా వ్యాయామం చేస్తూ తగిన పోషకాహారం తీసుకుంటూ వ్యసనాల జోలికి వెళ్లకుండా ఉంటే జీవితం సాఫీగా సాగుతుందన్నారు. తద్వారా పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకొచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐజీ వెంట ఎస్పీ విక్రాంత్ పాటిల్, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, త్రీటౌన్ సీఐ కేవీవీ సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



తీరంలో అలల ఉధృతి

- మాయాపట్నంలో 8 గుడెసెలు నేలమట్టం
- మత్స్యకారుల నివాసాల్లోకి దూసుకొస్తున్న కెరటాలు

కెరటాల ఉధృతికి మాయాపట్నంలో కొట్టుకొనిపోయిన మత్స్యకారుల ఇళ్లు

కొత్తపల్లి, అక్టోబరు 16: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తీరప్రాంతాల్లో కెరటాలు తారాస్థాయిలో ఎగసిపడుతు న్నాయి. ఉవ్వెత్తున ఎగసిపడే రాకాసి అలలు నేరుగా మత్స్యకారుల గుడెసెలవైపు దూసుకొస్తున్నాయి. దీంతో కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం మాయాపట్నంలో 8 గుడెసెలు సముద్రంలో కలిసిపోయాయి. పెంకుటిల్లులపై కప్పు కొట్టుకొనిపోగా మొండి గోడలు ఒడ్డున దర్శనమిస్తున్నాయి. సముద్ర కెరటాల ధాటినుంచి రక్షణగా సూరాడపేటలో గతంలో నిర్మించిన జియో ట్యూబ్‌లపై నుంచి కెరటాలు వేగంగా మత్స్యకారుల ఇళ్లల్లోకి పోటెత్తుతున్నాయి. ప్రతీసారీ తుఫాన్, అల్పపీడనాలు ఏర్పడినప్పుడల్లా తీరప్రాంతాల్లో నివాసం ఉండే మత్స్యకారుల పరిస్థితి చాలా దయనీయంగా మారుతోంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది ప్రజాప్రతినిధులు వచ్చినా తీరప్రాంత రక్షణకు ఎటువంటి శాశ్వత రక్షణచర్యలు చేపట్టకపోవ డంపట్ల మత్స్యకారులు నిట్టూర్పులు విడవడం గమనార్హం. సము ద్రం కల్లోలంగా ఉండటంతో తీరప్రాంత గ్రామాలకు చెందిన మత్స్యకారులు బోట్లను రామన్నపాలెం, శీలంవారిపాలెం ఉప్పుటేరువద్ద లంగర్‌వేసి భద్రపరిచారు. ఇంజన్లు, విలువైన వలలు ఇతర సామాగ్రిలను ఇళ్లవద్దకు తరలించి జాగ్రత్త చేసుకున్నారు.



మాయాపట్నం మత్స్యకారుల నివాసిత ప్రాంతాల్లోకి చేరిన సముద్రం నీరు

వరుస తుపాన్‌లతో జీవనోపాధికి గండి

ఇటీవల వరుస తుపాన్‌లు సంభవించడంతో తీరప్రాంత మత్స్యకారు లు జీవనోపాధికి గండి ఏర్పడింది. ఈ యేడాది వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందాల్సిన వేట పరిహారం ఇప్పటికీ మంజూరు కాకపోవడం, వరుసు తుపాన్‌లతో ఉపాధి లేకపోవడం వం టి కారణాలతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. వేట లేకపోయినా, పరిహారం అందక పోయినా వడ్డీలకు అప్పులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటు న్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రజలను అప్రమత్తం చేస్తున్న కూనవరం ఎస్ఐ లతాశ్రీ, ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ కరుణాకర్

పులి ఉంది జాగ్రత్త..

- పాలగూడెం జంక్షన్‌లో పులి సంచారం
- అప్రమత్తం చేసిన ఎస్ఐ, ఎఫ్ఆర్‌వో

కూనవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండల పరిధిలో పులి సంచరిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూనవరం ఎస్ఐ లతాశ్రీ, ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ కరుణాకర్ అన్నారు. పులి సంచరిస్తున్న ఆయా గ్రామాల్లో ప్రజలను బుధవారం అప్రమత్తం చేశారు. మండలంలోని పెదనర్సింగపేట, దుగుట్ట, కాచవరం గ్రామాల్లో ఈసందర్భంగా చాటింపులు వేయించారు. పెద్దపులి పశువులపై ఎటువంటి దాడి చేసిన, పులి ఆనవాళ్లు తెలిసిన వెంటనే అటవీశాఖాధికారులు, పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పులి హాని చేస్తుందన్న భయంతో ఎటువంటి విషపూరిత ఆహారం పెట్టడం, కరెంటు తీగలు అమర్చడం వంటివి చేయవద్దని రేంజర్, ఎస్ఐ హెచ్చరించారు.

పాలగూడెం జంక్షన్‌లో పులి

పాలగూడెం జంక్షన్, బోదునూరు పరిసరాల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు బుధవారం రాత్రి గుర్తించారు. పులి సంచరించేందుకు అనువైన ప్రదేశాలు ఈప్రాంతంలో ఉన్నాయి. డీఎఫ్‌వో భవిత, సబ్ డీఎఫ్‌వో కేవీఎస్ రాఘవరావు ఆదేశాల మేరకు ఈప్రాంతంలో సిబ్బందిని ఏర్పాటు చేశామని అటవీ శాఖాధికారి కరుణాకర్ తెలిపారు.

ఆడ పులి జాడ కోసమేనా..?

ప్రస్తుతం మండలంలో సంచరిస్తున్న ఆడ పులి జాడ కోసమే పయనిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అటవీశాఖాధికారుల లెక్క ల ప్రకారం 2012 నుంచి ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుంది. ఆంధ్ర-చత్తీస్‌ఘడ్ సరిహద్దు ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అధికారులు అంచ నా వేస్తున్నారు. ఒక వేళ ఇప్పుడు సంచరిస్తున్న పులి మగ పులి అయితే వర్షాకాలం ముగుస్తున్న సమయంలో 60 స్క్వేర్‌కట్ పరిధిలో పులి తన సరిహద్దులను ఏర్పాటు చేసుకునే అవకాశముంది. పులి ఏర్పా టు చేసుకున్న సరిహద్దుల పరిధిలోకి ఇతర మగ పులులు రాకుండా సరిహద్దు చుట్టూ ఉన్న చెట్లపై తన కోరలతో రక్కి గుర్తులు పెడుతుంది. ఇది గమనించిన ఇతర పులులు ఆ పులి సరిహద్దుల్లోకి వెళ్లవు. అంతేకాకుండా ఆడ పులులను ఆకర్షించడానికి సరిహద్దు చుట్టూ తన మూత్రం పోసి ఆడ పులులను ఆకర్షిస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతం పులి ఇక్కడ సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పులి రామచంద్రపురం అడవు ల్లో దుగుట్టకు రెండు కిలో మీటర్ల పరిధిలో పులి ఓ చెరువు దగ్గర నీళ్లు తాగినట్లు బుధవారం అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పులి తన పనిని ముగించుకుని తన సొంత ప్రాంతానికి ప్రయాణమైనట్లు అధికారులు భావిస్తున్నారు. ఏదేమైనా మండలంలో పులి సంచరిస్తుందని తెలియడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కరప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వివాహ వేడుకకు లైటింగ్ బిగిస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో ఒక యువకుడు మృతి చెందాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కె.గంగవరం మండలం వట్రపూడి గ్రామానికి చెందిన శీలం నారాయణమూర్తి కుమారుడు ప్రవీణ్‌కుమార్ (17) అద్దంపల్లి గ్రామానికి చెందిన యనమదల గోవింద్ అనే ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద లైటింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కరప మండలం కొంగోడు గ్రామానికి చెందిన అనుపతి శ్రీను ఇంట్లో వివాహ వేడుకకు సంబంధించిన లైటింగ్ పనుల్లో ప్రవీణ్‌కుమార్ నిమగ్నమయ్యాడు. నిచ్చెన ఎక్కి లైట్లు బిగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కిందపడిపోయాడు. క్షతగాత్రుడ్ని గొల్లపాలెం పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం సీతంపేట మూలగొయ్యి మలుపు వద్ద డ్రైనేజీలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. కృష్ణాజిల్లా గుణదల ప్రాంతానికి చెందిన కె.శ్రీహరిప్రసాద్(51) స్థానిక గోకవరం బస్టాండ్‌వద్ద ఒక హోటల్‌లో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా మూలగొయ్యిలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అతనికి ఇక్కడ ఎవ్వరూ లేరు. ఈ క్రమంలో ఈనెల 13నుంచి శ్రీహరి కనిపించడంలేదు. బుధవారం స్థానికులు డ్రైనేజీలో ఒక వ్యక్తి మృతదేహాన్ని గమనించి త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆ మృతదేహం శ్రీహరిదిగా గుర్తించారు. అతడికి ఒక కాలికి పుండ్లు ఉండడంతో కాలు సరిగ్గా పనిచేయదని, మద్యం అలవాటు ఉందని, డ్రైనేజీ గోడపై కూర్చుని మందు తాగుతాడని ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ అందులో పడి ఉంటాడని స్థానికులు పోలీసులకు చెప్పారు. ఈ మేరకు పోలీసులు శ్రీహరి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. కృష్ణాజిల్లా గుణదల ప్రాంతంలోని అతడి బంధువులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత బుధవారం జిల్లాకోర్టు ఆవరణంలో అండర్ ట్రయిల్ ముద్దాయిల కమిటీ మీటింగ్, ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణలో ఉన్న ముద్దాయిల కేసుల దర్యాప్తు, చార్జ్ షీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిల్ జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. సంబంధిత న్యాయస్థానాలకు తగిన సిఫార్సులు చేశారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యక్రమాలను, బాధితుల పరిహారం సంబంధిత అంశాల ను ఆమోదించారు. హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. డిసెంబరు 14న జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారయోగ్యమైన వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాల న్నారు. ఈ సమావేశంలో 1వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్, జిల్లా ఎస్పీ డీఎన్ కిశోర్, కాకినాడ అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీఆర్ పీబీ ప్రసాద్, రాజమహేంద్రవరం జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, గవర్నమెంట్ ప్లీడర్ సీహెచ్ ప్రసాద్, కొత్తపేట, అమలాపురం డీఆర్‌డీవోలు, సెంట్రల్ జైలు, మహిళా జైలు అధికారులు పాల్గొన్నారు.

అత్తారింటికి వెళ్తూ అనంతలోకాలకు..

- ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



మృతి చెందిన జాలిపర్తి సుధీర్

గోపాలపురం, అక్టోబరు 16: అత్తారింటికని బయల్దేరి తాను నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం లోని గోపవరం, రాంపాలెం గ్రామాల మధ్య బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గోపవరం గ్రామానికి చెందిన జాలిపర్తి సుధీర్(30) కరగపాడుకు చెందిన కొక్కిరిపాటి దుర్గశ్రీకి గత రెండేళ్ల క్రితం వివాహమైంది. అయితే గోపవరంలోని ఒక ప్రయివేటు కంపెనీలో జీవనోపాధి కోసం పనిచేస్తున్న సుధీర్ కరగపాడులో అత్తారింటి వద్ద ఉన్న తన భార్యను తీసుకురావడానికి డ్యూటీకి సెలవుపెట్టి గోపవరం నుంచి తన ద్విచక్రవాహనంపై బయల్దేరి కరగపాడు వెళ్తుండగా మార్గమధ్యంలో రాంపాలెం శివారులో తాను నడుపుతున్న వాహనం అదుపుతప్పి రాయిని ఢీకొనడంతో సుధీర్ అక్కడికక్కడే మృతి చెందాడని అన్నారు. మృతుని భార్య దుర్గాశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో పౌర సరఫరాల అధికారులు

1120 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రేషన్(పీడీఎస్) బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్టేడియం రోడ్డు సమీపంలోని ఓ షాపులో పేదల బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారంతో దాడులు చేశామని అధికారులు తెలిపారు. 1120 కిలోల బియ్యం మూటలను సీజ్ చేశామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన నాగేంద్రబాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని, నిఘా పటిష్టం చేశామని చెప్పారు. రేషన్ బియ్యాన్ని విక్రయించడం, అక్రమంగా నిల్వ చేయడం వంటివి నేరమన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో రాజమహేంద్రవరం డివిజన్ అసిస్టెంట్ సివిల్ సప్లయిస్ అధికారి ఎం.నాగాంజనేయులు, డీటీలు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ మృతి కేసులో

ముగ్గురి అరెస్టు

- వివరాలు వెల్లడించిన చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



నిందితులు వంతుల జయసేన, కిలో పరుశురాం, కిలో దాసు

మోతుగూడెం, అక్టోబరు 16: అడవి జంతువులను వేటాడటం కోసం ఏర్పాటుచేసిన విద్యు త్ తీగలు తగిలి ప్రాణాలు కోల్పోయిన సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.తిరునావు కరసు కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చింతూ రు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మెట్టగూడెం గ్రామం పైవీధి శివారున ఉన్న అటవీ ప్రాంతంలో అదే గ్రామానికి వంతల జయసేన్, కిలో పరుశురాం, కిలో దాసు అడవి జంతు వుల ను వేటాడటం కోసం విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేశారు. 6.3 కేవీ విద్యుత్ లైన్‌కి ఈ ఉచ్చు కలిపారు. ఈనెల ఆరో తేదీన సీఆర్పీఎఫ్ పార్టీ కూంబింగ్ నిర్వహిస్తుండగా ఏఎస్ఐ తిరునా వుకరసు ఈ ఉచ్చు తగులుకుని ప్రాణాలు కోల్పోయారు. దీనిపై కేసు నమోదు చేసిన డొంకరాయి పోలీసులు నిందితులను బుధవారం అరెస్టు చేశారు. ఇంతకుముందు నిందితులు ఈ విధంగానే జంతువులను వేటాడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. కరెంటు ఉచ్చు వేయడానికి ఉపయోగించిన సర్వీసు వైర్లు, వెదురు బొంగు కర్రలు, గెడ బొంగు, ఐరన్ బైండింగ్, జీవైర్, ప్లాస్టిక్ గొట్టాలను నిందితులను వారి ఇంటి వద్ద పొదల్లో దాచిపెట్టగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం వారిని రిమాండ్‌కు పంపారు. అటవీ జంతువులను వేటాడటం నేరమని, వేట కోసం కరెంటు ఉచ్చువేస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కరెంటు ఉచ్చులు ఏ గ్రామాల్లో అయినా, ఏ ప్రదేశంల్లో అయినా తారసపడితే పోలీసులకు చెప్పాలని, కరెంటు ఉచ్చువేస్తున్నట్లు ఎవరిమీద అయినా అనుమానం ఉంటే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కి తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

- 16.738 కాసుల బంగారం, 7.810 కిలోల వెండి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

కడియం, అక్టోబరు 16: కడియపులంక చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది జూన్ 18న కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు ఇంట్లోకి దొంగలు ప్రవేశించి 108 గ్రాముల బంగారం, 3 కిలోల వెండి, రూ.1,08,000 నగదు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐ వై.రాంబాబు సిబ్బంది తో కలిసి కడియపులంకలో చాకలిరేవువద్ద గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పిల్లి సురేష్ అలియాస్ శివను, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన కాండ్రేగుల శ్రావణకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరం ఒప్పుకున్నారు. చోరీ సొత్తును అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన పోతంశెట్టి గోపాలకృష్ణారెడ్డికి విక్రయించేందుకు ఉంచినట్టు తెలిపారు. నిందితులు పెనుగొండలో రెండు, ప్రకాశం జిల్లా దర్శిలో ఒకటి, బాపట్ల జిల్లా చందోలులో ఒకచోట దొంగతనాలు చేసినట్టు ఒప్పుకున్నారు. కడియపులంకలో దొంగిలించిన వస్తువులతో పాటు, పెనుగొండ, దర్శిలో నేరాల్లో దొంగిలించిన బంగారు వస్తువులు మొత్తం 16.738 కాసులు, 7.810 కిలోల వెండి వస్తువులను స్వాధీన పరుచుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కడియపులంకలో కేసు చేదించడంలో కృషిచేసిన సీఐలు వెంకటేశ్వరరావు, రాంబాబు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.



తుని రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై ఎగసిపడుతున్న మంటలు

తుని రైల్వేస్టేషన్‌లో మంటలు

- పరుగులు తీసిన ప్రయాణికులు
- తప్పిన ప్రమాదం

తునిరూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా తుని రైల్వేస్టేషన్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. రెండో నంబరు ప్లాట్‌ఫారంపై ఒక్కసారిగా మంటలు చెల రేగడంతో ప్రయాణికులు పరుగులు తీశారు. సాయంత్రం విశాఖపట్నం వైపు ప్రయాణిం చేందుకు పెద్దఎత్తున ప్రయాణికులు వేచి ఉన్నారు. రైల్వేలైన్ కింద విద్యుత్‌వైర్లుకి షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగాయి. దీంతో రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు పరుగులు తీశారు. అప్రమత్తమైన రైల్వే ఎలక్ట్రికల్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలను అదుపుచేశారు. ప్రమాద సమయంలో తుని రైల్వేస్టేషన్ మీదుగా ఎటువంటి రైళ్లు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రైల్వే సిబ్బంది త్వరతగతిన మరమ్మతులు చేపట్టి విద్యుత్‌సరఫరా పునరుద్ధరించడంతో ప్రయాణికులు యథావిధిగా రాకపోకలు సాగించారు.

మన్యంలో మద్యం షాపులకు చిక్కులు

- హైకోర్టును ఆశ్రయించేందుకు గిరిజన నేతలు సిద్ధం
- గ్రామసభల తీర్మానం లేని షాపులను రద్దు చేయాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రంపచోడవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మన్యంలో మద్యంషాపుల మంజూరు వివాదంగా మారి, ఆయా షాపులను న్యాయపరమైన చిక్కులు చుట్టుముడుతున్నాయి. గ్రామసభల ఆమోదం లేకుండా మంజూరుచేసిన మద్యం షాపు లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే మరో ప్రక్క హైకోర్టును ఆశ్రయించేందుకు గిరిజన సంఘాల నేతలు సిద్ధమ వుతు న్నారు. బుధవారం గిరిజన సంఘం అధ్యక్షుడు లోతా రామారావు జిల్లా కలెక్టరుకు, అఖిల భారత రైతుకూలీ సంఘం డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవికి వినతులను అందించి షాపుల రద్దుకు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలో మంజూరైన 40 షాపులలో 18 షాపులు రంపచోడవరం, చింతూరు డివిజన్లలోనే ఉన్నాయి. గిరిజన ప్రాంతాల పంచాయతీరాజ్ చట్టం (పీసా) నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లో మద్యం విషయంలో గ్రామసభల తీర్మానాలు అవసరం. ఇక్కడ మద్యం షాపుల లైసెన్సులను ఆయా గ్రామసభల ఆమోదం పొందాకే జారీ చేయాలని కూటమి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టంగా పేర్కొంది. గ్రామసభల తీర్మానాల కోసం ఎక్సైజ్ అధికారులు ఆయా పంచాయతీలను కోరిన 4 వారాల్లో గ్రామసభల నుంచి ఎటువంటి తీర్మానాలు రాకుంటే ఆయా గ్రామసభలు షాపుల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్టే భావించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. కాగా అధికారులు గిరిజన చట్టాలను, ప్రభుత్వ ఉత్తర్వులను ఖాతరు చేయకుండా షాపుల లైసెన్సులు జారీ చేశారని గిరిజనుల ఆరోపణ.

మద్యం షాపులు తెరిచి మూసేశారు

మన్యంలో మద్యం షాపులను ఆయా లైసెన్సులు బుధవారం తెరిచినట్టు తెరిచి ఆ వెంటనే మూసేశారు. పీసా చట్టం కింద గ్రామసభల తీర్మానాలు లేకుండా షాపులను మం జూరు చేసిన అంశంలో వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు జాగ్రత్త పడ్డారు. రంపచోడవరంలో మంజూరైన రెండు షాపు లను నిర్వహించుకునేందుకు మద్యం లైసెన్స్‌లు ఏర్పాటు చేసుకోగా ఇప్పటికే రంపచో డవరం హైవేమీద షాపు ఏర్పాటు చేసుకోవడానికి ప్ర భుత్వ నిబంధనలే అడ్డు వస్తుండగా, దేవీపట్నం రోడ్‌లో ఏర్పాటుచేయాలనుకుంటున్న షాపును బస్‌స్టాండ్, బ్యాంకులు, విద్యాలయాలను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఏర్పాటు చేయరాదంటూ ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ షాపుల ఏర్పాటు విష యంలో సందిగ్ధత నెలకొంది. గ్రామసభల తీర్మానాల అంశంలో వస్తున్న వత్తిడి, న్యాయపరమైన చిక్కుల నేపథ్యంలో ఆయా మండలాల్లో మంజూరైన షాపులకు సంబంధించి ఆయా లైసెన్స్‌లే గ్రామసభల తీర్మానాల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీంతో ఆయా సర్పంచ్‌లపై వత్తిడి తెస్తూ అనుకూలంగా గ్రామసభల తీర్మానాలను పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గ్రామసభల వ్యవహారం తేలేవరకూ మన్యంలో మద్యం షాపులను తెరిచే అంశం ప్రశ్నార్థకమే అవుతోంది.



ఎమ్మెల్యే శిరీషాదేవికి ఫిర్యాదు చేస్తున్న రైతుకూలీ సంఘం కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి

అర్హులందరికీ ఉపాధి జాబ్‌కార్డులు జారీ చేయాలి

అల్లవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల్లో అర్హులందరికీ జాబ్‌కార్డులు జారీ చేయాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆదేశించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్త పనులు గుర్తించాలని, మంజూరైన పల్లె పండుగ, డ్రెయిన్ పనుల వివరాలు తెలిసేలా డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర, ఏపీవో వి.శ్రీనుబాబు, ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో బాలుర వసతిగృహం-1

- శ్లాబ్ నుంచి ఊడుతున్న పెచ్చులు
- లీకవుతున్న వర్షం నీరు
- బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్న విద్యార్థులు




రాజోలు సాంఘిక సంక్షేమశాఖ ఎస్సీ వసతిగృహం-1, విద్యార్థుల గదిలో పెచ్చులు ఊడుతున్న వసతిగృహం

రాజోలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో రాజోలు సాంఘిక సంక్షేమ శాఖ బాలుర ఎస్సీ వసతి గృహం-1 ఉంది. ఈహాస్టల్‌లో రాజోలు, మామిడికుదురు, మలికిపురం, అమలాపురం, పి.గన్నవరం, కాకినాడ, రావులపాలెం మండలాలకు చెందిన 56మంది విద్యార్థులు చేరారు. 3నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈవసతిగృహంలో ఉండి సమీపంలో ఉన్న పాఠశాలలకు వెళుతుంటారు. 56మంది విద్యార్థులు సమీపంలో ఉన్న మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులందరూ పాఠశాలకు వెళ్లి అనంతరం మళ్లీ వసతిగృహానికి చేరుకుంటారు. వసతిగృహం శ్లాబ్ నుంచి పెద్దపెద్ద పెచ్చులు ఊడి పడుతున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లిన తర్వాత పెచ్చులు ఊడి పడడంతో వారికి ఎటు



శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడుతున్న వసతిగృహం

వంటి గాయాలు కాలేదు. ఈ వసతిగృహంలో ఆరు గదులు ఉండగా 56మంది విద్యార్థులు ఆ గదుల్లో నిద్రిస్తారు. కొంత కాలంగా 2, 4, 6 గదుల్లో శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి కింద పడిపోతున్నాయి. 3వ గది నుంచి పెచ్చులు ఊడిపోయి శ్లాబ్ నుంచి వర్షం నీరు లీకవుతుంది. గదుల్లో వర్షం నీరు లీకవ్వడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. వసతిగృహంలో ఉన్న ఆరు గదుల్లో నాలుగు గదులు బాగోకపోవడంతో వసతిగృహం ఇన్‌చార్జి వార్డెన్ ఎస్‌జేఎస్ కుమార్ ఆ గదుల్లోకి విద్యార్థులు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మిగతా రెండు గదుల్లో 56మంది విద్యార్థులు నిద్రిస్తుండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నామని ఆవేదన చెందారు. వసతిగృహంలో రెండు స్నానపు గదులు, ఐదు మరుగుదొడ్లు ఉన్నాయి. మూడు మరుగుదొడ్లు పనిచేయకపోవడంతో రెండు మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన వసతిగృహాన్ని నిర్మించాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించాలి

మామిడికుదురు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరిగే నీటి సంఘాల ఎన్నికల్లో కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించాలని కౌలు రైతులు వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆచార్యులకు బుధవారం అందించారు. నీటి సంఘం ఎన్నికల్లో భూయజమానికి మాత్రమే ఓటు హక్కు ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో భూస్వాములెవరూ వ్యవసాయం చేయడం లేదని, నూటికి 80శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. కౌలు రైతులందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ద్వారా కోరారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, జిల్లా కమిటీ సభ్యుడు తాటికాయ ఉదయభాస్కరరావు, తాడి రామకృష్ణ, రాయుడు ఆనందరావు, పితాని పల్లపురాజు పాల్గొన్నారు.

నివాసాల వద్ద మద్యం షాపు వద్దు

కాట్రేనికోన, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నివాసాల వద్ద మద్యం షాపు వద్దన్న కారణంగా తమపై మద్యం సిండికేట్ సభ్యులు దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ కాట్రేనికోన ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న కుటుంబాలు బుధవారం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం తమ నివాసాల ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు పూజా కార్యక్రమాలు నిర్వహించారని, తాము అభ్యంతరం చెప్పడంతో మీకు దిక్కున్న చోట చెప్పుకోండంటూ తమపై దౌర్జన్యానికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్.పల్లారావు, సత్యవతి, ఎస్.సత్య, ఎం.రాధాకృష్ణ, వైదాడి భవాని, పి.అప్పారావు, సీహెచ్ విజయదుర్గ, పి.సూర్యనారాయణ, పీఎస్ వెంకటకుమార్, పందిరి శ్రీదుర్గ, పి.హేమశ్రీ తదితరులు వినతిపత్రం సమర్పించారు.

బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శులు



పూర్ణచంద్రరావు




శ్రీరామచంద్రమూర్తి

ఉప్పలగుప్తం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం పంచాయతీ కార్యదర్శిగా పల్లి పూర్ణచంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. చల్లపల్లి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా అడబాల శ్రీరామచంద్రమూర్తి బాధ్యతలు స్వీకరించారు. కాగా గొల్లవిల్లి పంచాయతీ ఇన్‌చార్జిగా కూడా శ్రీరామచంద్రమూర్తి బాధ్యతలు తీసుకున్నారు.

యూటీఎఫ్ హోంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం

అమలాపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎంప్లాయిస్ హోంలో బుధవారం ఎమ్మెల్సీ ఐళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింగి. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ సెప్టెంబరు 30 నుంచి ప్రారంభమై నవంబరు 6తో ముగుస్తుందని ఎమ్మెల్సీ ఐవీ తెలిపారు. 2025 నాటికి గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేసుకున్నవారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. కేంద్రంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు బి.చంద్రకళ, కె.శ్రీనివాసరావు, కేవీఎన్ గౌడ్, కేఎస్ఎస్‌వీడీ రమణ, కె.కిశోర్‌కుమార్, బీఎన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రేమ మందిరంలో పెళ్లి



అమలాపురంటౌన్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): అమలాపురం కామాక్షీ పీఠంలోని ప్రేమ మందిరంలో ఆశ్రయం పొందుతున్న మరో ఆడపడుచు వివాహం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. ఎన్నో ఏళ్లుగా ఆశ్రయం పొందుతున్న సత్యవైష్ణవిని కాకినాడ జిల్లా తునికి చెందిన వెంకటశర్మకు ఇచ్చి బుధవారం రాత్రి కామాక్షి రత్న కల్యాణ మండపంలో పీఠాధిపతి కామేశమహర్షి సమక్షంలో వివాహం జరిపించారు. కామేశమహర్షి ఆ దంపతులను ఆశీర్వదించారు. వివాహ క్రతువు నిర్వ హించగా ట్రస్టు సభ్యులు వక్కలంక వాణి, వీరా నాగేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, ఎం.దుర్గారావు పాల్గొన్నారు. వధువు సత్యవైష్ణవి తరపున పట్టణానికి చెందిన పెమ్మరాజు వీరవెంకటసత్య సూర్యసుబ్రహ్మణ్యవరప్రసాదరావు-సుజాత దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు.

బండారులంకలో స్వచ్ఛత (న) హీ

- చెత్తను డంపింగ్ చేసేది ఎక్కడ
- రోడ్లకు ఇరువైపులా పేరుకుపోతున్న చెత్త

అమలాపురం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బండారులంక గ్రామంలో వారం రోజులుగా చెత్తను ఎక్కడ డంపింగ్ చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. డంపింగ్ యార్డు కోసం ప్రత్యేకంగా పంచాయతీకి స్థలం లేకపోవడంతో ఈపరిస్థితి ఏర్పడింది. చెత్తను వేసే స్థలం లేకపోవడంతో సేకరించిన చెత్తతో నిండి ఉన్న ట్రాక్టర్లను ఐదు రోజులుగా పంచాయతీ కార్యాలయం ఎదుట వదిలేశారు. చివరకు బుధవారం గ్రామానికి చెందిన రైతు ఉప్పుగంటి భాస్కరరావు పొలంలో ట్రాక్టర్లలోని చెత్తను దింపుకునేందుకు ముందుకు వచ్చాడు. గంగలకుర్రు అగ్రహారం వెళ్లే రోడ్డులో శ్మశాన వాటిక చెంతన కొంతకాలంగా పంచాయతీవారు చెత్తను డంపింగ్ చేసేవారు. అదే ప్రాంతంలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని సైతం మరో పక్కన నిర్మించారు. అయితే అది వినియోగంలోకి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అంతకుముందు చెత్తను చినచంద్రపురం వద్ద లోయర్ కౌశిక డ్రెయిన్ చెంతన డంపింగ్ చేసేవారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళనకు దిగడంతో చెత్తను తీసుకువస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. వారం రోజుల క్రితం అప్పటి జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు



బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద చెత్తతో నిండి ఉన్న ట్రాక్టర్లు

గ్రామానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. అమలాపురం పురపాలక సంఘ డంపింగ్ యార్డుకు బండారులంక నుంచి చెత్తను తరలించాలని పంచాయతీ వారిని ఆదేశించారు. అయితే సమీప గ్రామాల చెత్తను కూడా తీసుకువచ్చి అమలాపురంలో వేయడం ఏమిటని కొందరు కౌన్సిలర్లు అడ్డుకున్నారు. చివరకు చెత్తతో వచ్చిన ట్రాక్టర్లను సైతం తిరిగి వెనక్కి పంపించేయడంతో పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నాయి. దాంతో అప్పటి నుంచి చెత్తను ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం గ్రామంలో ఏ వీధికి వెళ్లినా రోడ్లకు ఇరువైపులా చెత్తతో నిండిన కుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్త సమస్యను కార్యదర్శి కోరుమిల్లి శ్రీనివాస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో రెండు రోజులుగా పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామపెద్దలతో సర్పంచ్ పెనుమాల సునీత సమావేశాలు నిర్వహించారు. అయినప్పటికీ పరిష్కారం లభించలేదు. బుధవారం ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజును కలిసి పరిస్థితిని వివరించారు. సమస్యను డీపీవో దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. బండారులంకలో నెలకొన్న చెత్త సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గ్రామంలో వైరల్ జ్వరాలతో పాటు డెంగ్యూ తదితర జ్వరాలతో తీవ్రంగా ఎందరో బాధపడుతున్నారు. మినీ డంపింగ్ యార్డులుగా మారిన చెత్త కుప్పలను తొలగించకపోతే ప్రజారోగ్యం దెబ్బతింటుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

చెత్త సమస్యను పరిష్కరించాలి
పెనుమాల సునీత, సర్పంచ్



గ్రామంలో డంపింగ్ యార్డు లేకపోవడం వల్ల చెత్త ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. తక్షణం ఉన్నతాధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలి. పేరుకుపోతున్న చెత్తతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా చెత్తను సేకరించలేని పరిస్థితి. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి. ఇప్పటికే అధికారులందరికీ సమస్యను వివరించాం.

ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు

అంబాజీపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు పార్టీలకు అతీతంగా ప్రాధాన్యం కల్పించాలని, ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ సీఈవో పీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు చాంబర్‌లో ఆయన ఎంపీటీసీలతో మాట్లాడారు. ఎంపీడీవో జీవీ సరోవర్ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఆహ్వానించకుండా అవమానిస్తున్నారని, ఫ్లెక్సీలపై ఎంపీపీ, జడ్పీటీసీ ఫొటోలు వేయకుండా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని సీఈవోకు ఫిర్యాదు చేశారు. అలాగే ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ



అంబాజీపేటలో ఎంపీడీవోపై సీఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీలు

లేకుండా ఎంపీడీవో సమావేశాన్ని నిర్వహించడంపై ఎంపీటీసీలు సీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజాప్రతినిధులు ఏ పార్టీకి చెందిన వారైనా ప్రొటోకాల్ పాటించాలని ఇప్పటికే అధికారులకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఎంపీడీవో జీవీ సరోవర్ అయినవిల్లి ఏవోగా బదిలీ అయినప్పటికి ఇంకా బాధ్యతలు స్వీకరించలేదని సీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఇక్కడ కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని త్వరలో బాధ్యతలు తీసుకుంటారని సీఈవో తెలిపారు. కోనసీమ జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న అంబాజీపేట, అయినవిల్లి, రాజోలు, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం మండలాలకు త్వరలో పూర్తిస్థాయి ఎంపీడీవోలను నియమిస్తామన్నారు. స్థానిక పశువుల మార్కెట్ వద్ద ఉన్న ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్నప్పటికి పట్టించుకోవడంలేదని స్థానికులు సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, నూకపెయ్యి సత్యనారాయణ, నాయకుడు మైలా ఆనందరావు ఉన్నారు.

పల్లెల్లో సీసీ రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే భూమిపూజ




ముమ్మళ్లలో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న బుచ్చిబాబు

ఐ.పోలవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.4.26కోట్లతో 13పంచాయతీలకు సంబంధించి 46 ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శంకుస్థాపన చేశారు. కేశనకుర్రు, తిళ్ళకుప్ప, ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, కొమరగిరి, పశువుల్లంక, మురమళ్ళ, ఎదురులంక, గుత్తెనదీవి, జి.వేమవరం, జి.మూలపొలం, భైరవపాలెం గ్రామాల్లో కార్యక్రమాలు జరిగాయి. నియోజకవర్గంలో ఉపాధి పథకంలో భాగంగా గ్రామాల అభివృద్ధికి రూ.13.50కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, కాకర్లపూడి రాజేష్, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, చిలుకూరి సుబ్బరాజు, సర్పంచ్‌లు బీర సత్యకుమారి, కడియం తమ్మయ్య, వరసాల విజయచాముండేశ్వరి, కాలే రాజబాబు, ముదునూరి పద్మఅర్జున్‌రాజు, లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు, నాయకులు దాసరి జగదీశ్వరి, సాకా సీతాదేవి, ధూళిపూడి చక్రం, గాదిరాజు రామకృష్ణంరాజు, సుంకర శేషారావు, పిన్నమరాజు శివ, బొంతు శ్రీరాములు, ఆకుల సత్తిబాబు, దూలపూడి రాంబాబు, జంపన బాబు, పెంట రవి, ఏలూరి మూర్తి, పెసంగి ధర్మారావు, రేకాడి మురళీకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముమ్మిడివరం,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతున్న మహిళ బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. అయినవిల్లి మండలం వెలువలపల్లికి చెం దిన నేదునూరి గంగరాజు, నేదునూరి సావిత్రి (51) అమలాపురంలోని వెత్సావారి అగ్రహారంలోని ఓ అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. బార్యాభర్తలిద్దరూ గత నెల23న హోమియో మందుల కోసం ముమ్మిడివరం స్కూటీపై వస్తుండగా బొండాయికోడు సమీపంలో బొలెరో వాహనం ఢీకొనడంతో వారు గాయపడ్డారు. సావిత్రి తీవ్రంగా గాయపడింది. అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో పవర్‌పై సాంకేతిక సమస్యలు



గ్రేడ్-5 కార్యదర్శుల డీడీవో పవర్‌పై డీఎల్‌పీవో సమక్షంలో పరిశీలన చేస్తున్న అధికారులు

అమలాపురం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-5 కార్యదర్శులకు పంచాయతీల కార్యదర్శులుగా నియమిస్తూ డీడీవో పవర్‌ను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే గ్రేడ్-5 కార్యదర్శుల పరిధిలో ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారన్న అంశంపై పూర్తిస్థాయిలో స్పష్టత లేకపోగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఒక్కో రకమైన జాబితాలు ఉండడంతో సిబ్బంది జీతాల చెల్లింపులపై అవరోధం ఏర్పడింది. దాంతో జిల్లా పంచాయతీ అధికారిణి శాంతికుమారి ఆదేశాల మేరకు బుధవారం అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, సబ్‌ట్రెజరీ అధికారులతో డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సిబ్బంది జీతాల చెల్లింపు, క్యాడర్ స్ట్రెంత్ తదితర అంశాలపై ఒక స్పష్టతను తీసుకువచ్చారు. ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, ఈవోపీఆర్డీలు బి.మంగాదేవి, గౌరీ, రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలి

అంతర్వేది, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో టీచర్ల సూచనలు అనుసరించి ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సమగ్రశిక్షా సీఎంవో బోరుసు సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూచించారు. పల్లిపాలెం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా సీఎంవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు రాసున్న పరీక్షలపై ముఖాముఖి నిర్వహించారు. మొదటిసెల్ఫ్ అసైన్‌మెంట్ మోడల్ పేపర్ ఎగ్జామ్ ప్రశ్నాపత్రాలను పరిశీలించారు. రెండో సెల్ఫ్ అసైన్‌మెంట్ మోడల్ పేపర్ పరీక్షలు ఈనెల21నుంచి జరగవచ్చునని, సిలబస్ ప్రకారం చదువుకోవాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.రత్నరాజు, ఉపాధ్యాయులు ప్రేమ్‌చంద్, జ్యోతి పాల్గొన్నారు.

- కొద్ది వానకే ముంపు బారిన పడుతున్న కాట్రేనికోన వారపు సంత
- ఆక్రమణలకు గురైన మురుగు దిగే చెరువు

ముంపు నుంచి రక్షించండి మహాప్రభో!




కాట్రేనికోన వారపుసంత ముంపులో ఉన్న దృశ్యాలు

కాట్రేనికోన, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన పంచాయతీలో వారపుసంత జరిగే ప్రదేశం కొద్ది వానకే ముంపు బారిన పడుతోంది. పల్లపు ప్రాంతం కావడం, మురుగుదిగే చెరువు ఆక్రమణలకు గురికాడంతో మురుగు దిగే దారిలేక వర్షాలకు జలమయమవుతోంది. ఈప్రాంతంలో వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. నెలల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల పాలవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షేమం.. అభివృద్ధే.. కూటమి ప్రభుత్వ లక్ష్యం



పాలగుమ్మిలో పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంరూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రతీ గ్రామంలో పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. బుధవారం మండలం భట్నవిల్లి, ఎ.వేమవరప్పాడు, ఎ.వేమవరం, జనుపల్లి, పాలగుమ్మి గ్రామాల్లో ఆయా పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళితో కలిసి ఎమ్మెల్యే ఆనందరావు రూ.56లక్షల విలువైన పనులకు భూమిపూజ, శంకుస్థాపనలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు రావూరి వెంకటలక్ష్మి, పందిరి విజయ, తిరుకోటి సుజాత, గాజాల భారతి, కుడుపూడి రామలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో నాయకులు మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, లింగోలు పండు, నడింపల్లి ఉదయబాబు, మంథా ఫణికుమార్, పొలమూరి ధర్మపాల్, దాసం గోపి, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, ఏపీవో శివకుమారి, ముత్తాబత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో సొసైటీ ఉద్యోగుల నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మామిడికుదురు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ మామిడికుదురు సహకార పరపతి సంఘ ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియచేస్తూ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘాల్లో 2019 అనంతరం నియమించిన ఉద్యోగులను తొలగించడాన్ని విరమించుకోవాలని, ఉద్యోగ విరమణ62 ఏళ్లకు పెంచాలని, జీవో నంబరు 36 ప్రకారం వేతన సవరణచేసి జీత భత్యాలు చెల్లించాలని కోరారు. వారం రోజులు నల్ల బ్యాడ్జీతో నిరసన తెలియజేస్తామని, డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల21న డీసీసీబీ ప్రధాన కార్యాలయం కాకినాడ ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. రొక్కం జనార్ధనరెడ్డి, అడబాల పెద్దిరాజు, నయినాల శ్రీరామ్, మూర్తి, పెద్ద పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయి



తాటిపాకలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా తాటిపాక, రాజోలు, సోంపల్లి, శివకోటి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని, రోడ్లన్నీ నాశనం అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, గుండుబోగుల పెద్దకాపు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, గాలిదేవర వెంకన్నబాబు, రాజోలు మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, యింటిపల్లి ఆనందరాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, సర్పంచ్‌లు కోటిపల్లి రత్నమాల, రేవు జ్యోతి, నక్కా రామారావు, ఉప సర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, తహసీల్దార్ ప్రసాద్, ఈవోపీఆర్డీ జి.భీమారావు, మోకా పార్వతి, గుబ్బల కుమార్ పాల్గొన్నారు.

ఓఎన్జీసీ నష్టపరిహారం చెల్లింపునకు కేంద్రమంత్రి హామీ



కేంద్రమంత్రితో చర్చిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

కాట్రేనికోన, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉప్పూడి గ్రామస్థులను నష్టపరిహారం చెల్లింపునకు కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరి హామీ ఇచ్చినట్లు ఎంపి హరీష్‌మాధుర్ తెలిపారు. ఇటీవల ఉప్పూడి గ్రామస్థులు గతంలో జరిగిన బ్లోఅవుట్ కారణంగా తమకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో ఓఎన్‌జీసీ వాహనాలు అడ్డుకున్న సంగతి తెలిసిందే. తదుపరి ఉప్పూడి గ్రామస్థులు ఎంపీ హరీష్ మాధుర్‌ను కలసి ఓఎన్‌జీసీ అధికారులు హామీ ఇచ్చి రెండేళ్ల గడుస్తున్నా నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో ఎంపీ హరీష్‌మాదుర్ ఉప్పూడి గ్రామస్థులకు నష్టపరిహారం చెల్లింపు విషయమై ఢిల్లీలో కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్దీప్‌సింగ్ పూరి ని కలసి చర్చించారు. ఓఎన్‌జీసీ నుంచి సబ్‌కాంట్రాక్టు తీసుకోవడం కారణంగా సాంకేతిక కారణాలతో నష్టపరిహారం చెల్లించలేదని, ఉప్పూడి గ్రామస్థులకు నష్టపరిహారం చెల్లింపునకు తగిన ఆదేశాలు ఇస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీ హరీష్‌మాదుర్ తెలిపారు.

నియోజకవర్గంలో గ్రామీణ రహదారులకు మోక్షం

పి.గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగతో నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులకు మోక్షం లభించిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు చేసి అనంతరం మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి బటన్ నొక్కుడుకే ప్రాధాన్యం ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో చేస్తుందన్నారు. అనంతరం పి.గన్నవరంలో రూ.32లక్షలు, వై.వి.పాలెంలో రూ.10లక్షలు, బెల్లంపూడిలో రూ.7లక్షలు, ఉడిమూడిలో రూ.20 లక్షలు, గంటిపెద పూడిలో రూ.15లక్షలు, కుందాలపలిల్లో రూ.23లక్షలు, నరేంద్రపురంలో రూ.23 లక్షలు, రాజులపాలెంలో రూ.25లక్షలు, పోతవరంలో రూ.10 లక్షలు, ముంగండలో రూ.15లక్షలు నిధులతో వెరసి 28 పనులకు రూ.1.82కోట్ల ఉపాధీహామి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు ఎమ్మెల్యేతో పాటు పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల భూమి పూజల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీపీడీవో కేవీ ప్రసాద్, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు బొం డాడ నాగమణి, నూకపెయ్యి ప్రసన్నకుమార్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, చొల్లంగి సత్తిబాబు, నంసాని పెద్దిరాజు, దాసరి వీరవెంకటసత్యనా రాయణ, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, యర్రంశెట్టి సాయిబాబు, ఆరుమిల్లి సాయిబాబు, శేరు శ్రీనుబాబు, గుత్తుల రామకృష్ణ, ఈశ్వర్, పంచాయితీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పి.గన్నవరం శివారు డియస్‌పాలెంలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

వైభవంగా శ్రీదేవి అమ్మవారి నిమజ్జనోత్సవం

అమలాపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లో దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారి ఉత్సవమూర్తి నిమజ్జనోత్సవం చేపట్టారు. శ్రీదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. వాహనాన్ని సైతం ప్రత్యేకంగా పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. వందలాది మంది భక్తులు వెంటరాగా బాణసంచా కాల్పుల నడుమ కోయడ్యాన్సులు, గరగ నృత్యాలు, శక్తివేషాలు, కేరళ డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టగా రాత్రికి హైస్కూలు సెంటర్ మీదుగా అమలాపురం గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు నడుమ ముమ్మిడివరం గేటు సెంటర్ మీదుగా అమలాపురం- చల్లపల్లి ప్రధాన పంటకాల్వ వద్దకు చేరుకుంది. ఉత్సవమూర్తిని భక్తుల సమక్షంలో నిమజ్జనంచేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలోబందోబస్తుఏర్పాటుచేశారు.

శ్రీదేవి అమ్మవారి ఉత్సవమూర్తి ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో ఊరేగిస్తున్న దృశ్యం



జాబ్‌మేళాలో 16 మంది అర్హత

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 16మంది అర్హతసాధించినట్లు ప్రిన్సిపాల్ డా. ఎన్.శ్రీనివాస్ తెలిపారు. ఏపీ స్కిల్‌డెవలెప్‌మెంటు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీజాబ్ మేళాకు 58 మంది హాజరుకాగా మౌఖిక పరీక్షల్లో 16మంది అర్హత సాధించారు. తుది దశ ఇంటర్వ్యూలు నిర్వహించి కంపెనీలు విధుల్లోకి తీసుకుంటాయి. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రఘువర్మ, ప్లేస్‌మెంటు అధికారి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన టెక్నో పార్కు

- లక్షలు పోసి రైతుల కోసం నిర్మించారు
- వినియోగించటం మరిచారు



మండపేట పశుశిక్షణా కేంద్రంలో నిర్మించిన టెక్నోపార్కు దుస్థితి, పశుగ్రాస క్షేత్రం చిట్టడివిని తలపిస్తున్న దృశ్యం

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత రెండో స్థానం పాడి పరిశ్రమకు ఉంటుంది. పాడి పరిశ్రమభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికి గ్రామీణ ప్రాంత పాడి రైతులకు సరైన అవగాహన లేకపోవటం వల్ల పాడి పరిశ్రమ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో రైతులకు సాంకేతిక శిక్షణ ఇచ్చివారికి ఆధునిక పద్ధతులు ద్వారా వారికి శిక్షణ ఇచ్చి ఆశించిన స్థాయిలో పాల దిగుబడులు సాధించటం ద్వారా వారి ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు మండపేట పశుశిక్షణ కేంద్రంలో 2017లో క్షీరసాంకేతిక దర్శిని (టెక్నోపార్కు)ను రూ.45 లక్షలతో ఏర్పాటు చేశారు. ఈతరహా పార్కు రాష్ట్రంలో మరెక్కడా లేదు. దేశవాళి ఆవులు గేదెలు, గొర్రెలు, మేకలు పోషణలో సాంకేతిక యాజమాన్య పద్ధతులు అధిక పోషక విలువలు కలిగిన పశుగ్రాసం ఉత్పత్తులు, తయారీకి సంబంధించి ఒకే చోటు రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేశారు. మండపేటలోనే ఎందుకంటే ఇక్కడ 1963లో 3.3ఎకరాల ప్రాంగణంలో పశు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రతి ఏటా రాష్ట్రంలో ఉన్న పశువైద్యులకు శిక్షణ ఇవ్వటంతో పాటు ఆధునాతన విధానంలో పశువైద్యం మెలకువలు గురించి తెలుసుకునేందుకు ఇక్కడకు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తుంటారు.

టెక్నో పార్కు ప్రత్యేక తలివి

ఇక్కడ ఏర్పాటు చేసిన టెక్నో పార్కును ప్రారంభించిన ఏడాదిపాటు పనిచేసింది. తర్వాత ఐదేళ్ల నుంచి మూతపడింది. దీనిగురించి పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చుచేసి ఇక్కడ నిర్మించిన టెక్నో పార్కులో 15షెడ్డులను నిర్మించారు. అందులో దేశవాళి పశుసంపద, గొర్రెలు మేకలు, పశుసంపద గురించి ఉంటాయి. పశుపోషణలో యాంత్రీక విధానం, ప్రత్యేక పరికరాలు ప్రదర్శన ఏర్పాటు చేశారు. నేల మీద కాకుండా ట్రేలలో ఉత్పత్తి చేసే అజొల్లా, హైడ్రోపోనిక్స్ వంటి పచ్చిమేత తయారీ విధానం, సైలేజ్ సంచులు, పచ్చగడ్డి, మాడుగ గడ్డి తయారీ విధానం, ఉత్తమ పోషక విలువలు కలిగిన 20రకాలు మేలుజాతి గడ్డి విత్తనాలు ప్రదర్శన, గడ్డి పెంపకం, ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేశారు. పశువుల్లో వచ్చే అంతరపరాన్నజీవులు, వ్యాధి కారక క్రిములు గురించి సమగ్ర వివరాల ప్రదర్శన(పెథలాజీ) విభాగాలను ఏర్పాటు చేశారు. మెరుగైన యాంత్రీకరణ విధానంలో పాలు తీయడం, పాలలో వెన్నతీయడం పాలతో క్రీము, ఐస్‌క్రీమ్స్ తయారీ విధానం, ఇతర పాల ఉత్పత్తులు తయారీ గురించి ఇక్కడ శిక్షణ ఇచ్చేందుకు దీనిని ఏర్పాటు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చే పశువైద్యులతో పాటు పాడిరైతులకు ఈకేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ ఇప్పుడు ఈశిక్షణా కేంద్రం ఐదేళ్ల నుంచి తెరుచుకున్న దాఖలాలు లేకపోవటంతో అలనా పాలనా పట్టించుకునేవారు లేకపోవడంతో మూలకు చేరింది. అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అరుణ్‌కుమార్ సూచనల మేరకు ఇక్కడ ఈకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంతో ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన ఈకేంద్రం నేడు పిచ్చిమొక్కలతో నిండి చిట్టడివిని తలపిస్తోంది. ఇక పశుగ్రాస క్షేత్రం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పాడిరైతుల కోసం నిర్మించిన ఈకేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పాడి రైతులు కోరుతున్నారు.

- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- రూ.2.48కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన
- వానపల్లి, అవిడి, మోడేకుర్రు, పలివెలలో సీసీ రోడ్లు

పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ


సీసీ డ్రెయిన్‌కు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు, కూటమి నాయకులు తదితరులు

కొత్తపేట, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ వచ్చిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం వానపల్లి, బిళ్లకుర్రు, మోడేకుర్రు, అవిడి, పలివెల, కొత్తపేట, పలివెల గ్రామాల్లో రూ.2కోట్ల 48లక్షల వ్యయంతో చేపట్టే పలు సీసీ రోడ్లు, డ్రెయిన్లకు ఆయన శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పల్లె పండుగ వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. రానున్న రోజుల్లో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో చేయనున్నట్లు చెప్పారు. ప్రజలందరూ కూటమి ప్రభుత్వ ప్రజాపాలనతో ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, బూసి జయలక్ష్మి భాస్కరరావు, పల్లి భీమారావు, సాదే లక్ష్మీశ్రీనివాస్, దర్నాల రామకృష్ణ, ముత్యాల బాబ్జి, రెడ్డి రామకృష్ణ, అద్దంకి చంటిబాబు, విళ్ల మారుతీప్రసాద్, గుబ్బల మూర్తి, కంఠంశెట్టి చంటి, చోడపనీడి ఉమ, వాసంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

కృష్ణమాదిగను విమర్శించే స్థాయి రాజేష్‌కు లేదు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్ తదితరులు

మండపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగపై మహాసేన రాజేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్ ఖండించారు. మందా కృష్ణమాదిగను విమర్శించే స్థాయి రాజేష్‌కు లేదన్నారు. తక్షణమే రాజేష్ క్షమాపణ చెప్పకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. మండపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాల మహానాడు నాయకులు జి.వి.హర్షకుమార్, కారెం శివాజీ, మల్లెల వెంకట్రావు ఉద్యమం కోసం పనిచేసారే తప్ప, వ్యక్తిగత స్వార్థం కోసం పనిచేయలేదని కితాబు ఇచ్చారు. ఎన్నికల ముందు మహాసేన రాజేష్ టీడీపీ జనసేన, బీజేపీ పార్టీలను తిట్టి విమర్శలు చేసిన రాజేష్ కూటమిలో ఎందుకు చేరాడని వారు ప్రశ్నించారు. సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మందపల్లి దొరబాబు, కౌన్సిలర్ సవరపు సతీష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బజ్జంగి సుధాకర్‌మాదిగ, కోనసీమ జిల్లా అధికార ప్రతినిధి మందపల్లి శ్రీనుబాబు, ఎంఎస్ఎఫ్ యుజన విభాగం అధ్యక్షుడు బుంగ సునీల్‌దత్, ముమ్మిడివరపు నారాయణరావు, పల్లెటి సతీష్, రాయిదొరబాబు, ఇడిగిమిల్లి ప్రసాద్, డిఎస్.రాజు పాల్గొన్నారు.

సాయిబాబా మృతికి మోదీ ప్రభుత్వమే బాధ్యత వహించాలి


సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ద్రాక్షారామ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించదగిన మేధావి, పీడిత ప్రజల హక్కుల పరిరక్షణకు పరితపించిన సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా మృతికి మోదీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం వెంకటాయపాలెం కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో సాయిబాబా చిత్ర పటానికి పీడీఎస్‌యూ, పీవైఎల్, ఏఐకేఎంఎస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం, ఆశయసాధనకు సాయిబాబా మడమ తిప్పని యోధుడని పేర్కొన్నారు. ప్రజలను, విద్యార్థులను, యువతను చైతన్యపరచడమే నేరంగా భావించిన బీజేపీ ప్రభుత్వం ఆయనను పదేళ్ల నాగపూర్ జైలులో అండాసెల్‌లో చీకటి గదిలో బంధించి చిత్రహింసలకు గురి చేశారన్నారు. సాయిబాబా మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి, పీవైఎల్ నాయకుడు అంబటి కృష్ణ, గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, రేవు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవిడిరేవులో బ్రాందీషాపు వద్దంటూ గ్రామస్తుల నిరసన


అవిడిరేవులో బ్రాందీ షాపు వద్దంటూ గ్రామస్తుల నిరసన

కొత్తపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అవిడిరేవులో నూతనంగా ఏర్పాటుచేసిన బ్రాందీషాపు జనావాసాల మధ్య ఉందని ఇక్కడ పెట్టవద్దంటూ గ్రామస్తులు ధర్నా చేశారు. గతంలో ఈ ప్రభుత్వ బ్రాందీషాపు ఉన్నప్పటి నుంచి అధికారులకు మొర పెడుతూనే ఉన్నామని, అయితే ప్రైవేటు పాటదారులు ఈ ప్రాంతంలో షాపు పెట్టకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారని చుట్టుపక్కల గ్రామస్తులు తెలిపారు. అయితే యథావిధిగా మళ్లీ జనావాసాల మధ్యనే అవిడిరేవులో బ్రాందీ షాపు ఏర్పాటు చేయడం పట్ల వారు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో చిన్నపిల్లలతో జీవిస్తున్నామని, మందుబాబులు చేసే ఆగడాలు భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను జనావాసాల మధ్య బ్రాందీ షాపును పెట్టడానికి వీలులేదని పాటదారులు వేరేచోటకు మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. అధికారులకు ఫిర్యాదు చేశారు.

పాట రేట్లపై మందు బాబులు గగ్గోలు..

కూటమి ప్రభుత్వం వచ్చాక పాటదారులకు వైన్ షాపులు కేటాయించారని, అయితే రేట్లు తగ్గించామని ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ పాత రేట్లకే అమ్ముతున్నారంటూ మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. రూ.99కే చీప్ లిక్కరు అమ్ముతామని ప్రభుత్వం చెప్పినప్పటికీ రూ.130కు అమ్ముతున్నారని వాపోయారు. ప్రభుత్వం ప్రకటించిన రేట్లకే అమ్మాలని వారు డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి


ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

ఆలమూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆలమూరులో బుధవారం స్థానిక జూనియర్ కాలేజీ వద్ద నిరసన చేపట్టారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపులో భాగంగా పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. గత ప్రభుత్వం జీవో నెంబరు 114 ప్రకారం కాంట్రాక్టు లెక్చరర్లు అందరినీ క్రమబద్ధీకరిస్తామని చెప్పి కాలయాపన చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో పి.సాంబశివమూర్తి, ఎ.అరుణకుమార్, ఎస్‌వీఎస్.సత్యనారాయణ, లలితాకామేశ్వరి, సీహెచ్ వేదమూర్తి, గోవిందుఅరుణకుమారి, మాధురి, ప్రశాంతి, సత్యవేణి పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం


వాడపల్లి వెంకన్న అన్నదాన పథకానికి రూ.50వేలు విరాళమందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి తాడేపల్లిగూడెంకు చెందిన పట్లంకి భుజంగరావు-భాగ్యలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళం సమర్పించారు. అలాగే బుధవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.1,45,001 లభించినట్లు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

నాగార్జున దూరవిద్య పరీక్షలు వాయిదా

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జరగాల్సిన నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య 1,3 సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జి.వి.రావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున అభ్యర్థులు అసౌకర్యానికి గురికాకుండా వాయిదా వేసినట్లు దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ రామచంద్రన్ తెలిపారని వివరించారు. 2,4 సెమిస్టరు పరీక్షలు యథావిధిగా జరుగుతాయని, వాయిదా పడ్డ పరీక్షలు నవంబరు 17 నుంచి జరుగుతాయని తెలిపారు.

పామర్రులో నిరుపయోగంగా ప్రభుత్వాసుపత్రి

- రూ. 1.50కోట్లతో ఆసుపత్రి నిర్మాణం
- రూ. 3.9లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వేయలేని వైనం


పామర్రులో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనం



పామర్రులో పాత ఆసుపత్రి భవనం (ప్రస్తుతం సేవలు అందిస్తున్న భవనం)

కె.గంగవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పది గ్రామాల్లో నివసించే 20వేల మందికి వైద్య సేవలు అందించే ఆరోగ్య కేంద్రం పామర్రు ప్రభుత్వాసుపత్రి. ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య కేంద్రం భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వం నూతన ఆసుపత్రి నిర్మాణానికి, ఫర్నీచర్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.కోటిన్నర నిధులు విడుదల చేసింది. నూతన భవనం నిర్మించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో హడావిడిగా ప్రారంభించారు. అయితే అన్ని హంగులతో నిర్మించిన భవనానికి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను ఏర్పాటు చేయాలి. దీంతో రూ.కోటిన్నరతో నిర్మించిన ఆసుపత్రి భవనం ఏడాదిగా నిరుపయోగంగా ఉంది. కేవలం రూ.3.90లక్షలు విద్యుత్ శాఖకు కేటాయించి ఉంటే నేటికి ఇది ప్రజలకు అందు బాటులో ఉండేది. గత పాలకులు దీనిపై దృష్టి పెట్టలేదు. దీంతో ఆసుపత్రికి వచ్చే ఒక మహిళ రూ.లక్ష విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చి నట్లు తెలిసింది. మరో రూ.2.9లక్షలు నిధులు సమకూరిస్తే విద్యుత్‌ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయవచ్చు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, స్థానిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆసుపత్రికి విద్యుత్ సరఫరా ఏర్పాటుచేయించి, నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని ఉపయోగంలోకి తీసుకువచ్చి మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో పల్లె సీమల అభివృద్ధి


రహదారులు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రాయవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పల్లెసీమలకు మహర్దశ పడుతోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.4,500కోట్లను కేటయించిందని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం వెదురుపాక, రాయవరం, వెంటూరు గ్రామాల్లో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమినేతలతో కలిసి ఎమ్మెల్యే రహదారుల పనులకు శంకుస్థాపనలు చేశారు. రహదారి పనులు నాణ్యత ప్రమాణాలతో చేయాలని ఆదేశించారు. రాయవరంలో రూ.30లక్షలు, వెదురుపాకలో రూ.20లక్షలు, వెంటూరులో రూ.50లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు వేగుళ్ల శంకుస్థాపన చేశారు. టీడీపీ నాయకులు ఉండవల్లి రాంబాబు, వల్లూరి శ్రీనివాస్, జనసేన నాయకులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు (చిన్ని), దేవిశెట్టి కరుణ, టీడీపీ నాయకులు ఎలుగుబట్ల గోపీకృష్ణ, బర్లరాజు, ఇందుగమెల్లి అరుణకుమార్ పాలింగి రాజు, కేతా శ్రీను, కాకరపర్తి శ్రీను, శీలం వీర్రాజు, షేక్ వల్లీ, అమీర్, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, డీఎల్‌డీవో శాంతి, ఎంపీడీవో కీర్తిస్పందన కుమారి, ఇంజనీరింగ్ అధికారులు వై.సూర్యనారాయణ, పి.లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

జిప్మెర్ ఆసుపత్రిలో మానసిక ఆరోగ్య వారోత్సవం


రోగులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

యానాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానసిక ఆరోగ్యవారోత్సవం సందర్భంగా యానాం జిప్మెర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆనందరాజు ఆధ్వర్యంలో యానాం జిప్మెర్ ఆసుపత్రిలో రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిప్మెర్ సిబ్బంది రోగులకు, వారి సంరక్షకులకు మానసిక ఆరోగ్యంపై సూచనలు సలహాలు ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా 20శాతం ప్రజలంటే ప్రతి పది మందిలో ఇద్దరు మానసిక రుగ్మతలు, సమస్యలతో బాధపడుతున్నారన్నారు. తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉన్నవాళ్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. 15-30ఏళ్ల వారిలో నిద్రలేకపోవడం, ఒత్తిడి, మాదక ద్రవ్యాలకు బానిసలవ్వడం, మితిమీరిన సెల్‌ఫోన్ వినియోగం, వీడియోగేమ్స్ తదితర కారణాలతో ఆత్మహత్యలు అధికంగా జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంకంపాలెం ఇసుక రీచ్‌ను పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్


అంకంపాలెం ఇసుక ర్యాంపు పరిశీలిస్తున్న ఆర్డీవో

ఆత్రేయపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు ఉచిత ఇసుకను అందించేందుకు సమాయత్తమైంది. ఆత్రేయపురం మండలం అంకంపాలెం ఇసుక ర్యాంపును బుధవారం కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పరిశీలించారు. ప్రస్తుతం గోదావరిలో ర్యాంపు ఏర్పాటు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. మైనింగ్ శాఖ అధికారులు జియో ట్యాగింగ్ నిర్వహించారు. స్టాకు పాయింట్ నిర్వహించే ప్రదేశాన్ని అధికారులతో వెళ్లి పరిశీలన చేశారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ర్యాంపుల పరిశీలన

రావులపాలెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పొడగట్లపల్లిలో ఉన్న ఇసుక ర్యాంపులను బుధవారం ఆర్డీవో పి.శ్రీకర్, తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ స్థానిక సిబ్బందితో కలిసి పరిశీలించారు. నూతన ఇసుక పాలసీలో భాగంగా పొడగట్లపల్లి, ఊబలంకల్లో ఉన్న ఇసుక ర్యాంపులను గుర్తించినట్లు చెప్పారు.

ఉపాధి గ్రామసభ



ఉపాధి గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీవో కవిత

ఉపాధి పనులపై చర్చ

రావులపాలెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఈతకోట పంచాయతీ వద్ద ఉపాధి గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో కవిత మాట్లాడుతూ ఉపాధి కార్డులు పొందేందుకు సంబంధిత పత్రాలను ఫీల్డు అసిస్టెంట్లకు అందజేయాలన్నారు. అలాగే ఇన్సూరెన్సుకు సంబంధించి ఆధార్ కార్డుతో ఉపాధి కూలీలు ఎన్‌రోల్‌మెంట్ చేయించుకుంటే ఇబ్బందులు జరిగినప్పుడు భరోసాగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో చేపట్టబోయే ఉపాధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు యర్రంశెట్టి నాగేశ్వరరావు, మిరియాల రాము, యర్రంశెట్టి రామ్మోహనరావు, గంట్రోతు వీరగోవిందరావు, కార్యదర్శి శర్మ, ఫీల్డు అసిస్టెంట్ గెద్దం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం, ద్రాక్షారామ సెక్షన్ల పరిధిలోల్లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణం, మండలంలో కొన్నిగ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ రత్నాలరావు తెలిపారు. పట్టణంలో మెయిన్‌రోడ్డు, రత్నంపేట, లలితానగర్, కవలవారిసావరం, మధ్యగనర్, కమ్మవారి సావరం, బ్రాడీపేట, ముచ్చుమిల్లి, గుబ్బలవారిపేట, స్టీల్‌వెల్‌పేట, చప్పిడివారి సావరం, మండలంలో చోడవరం, నరసాపురపుపేట, ఓదూరు ఆక్వాలకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తామన్నారు. ద్రాక్షారామ సెక్షన్ పరిధిలో ద్రాక్షారామ, అన్నాయిపేట, వెంకటాయపాలెం, హసన్‌బాద, కందులపాలెం, గొల్లల చెరువు, భీమక్రోసుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కె.గంగవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల18న శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, ఎంపీడీవో ఎన్. శ్రీనివాస్‌లు తెలిపారు. ఈసమావేశానికి మండల స్థాయి అధికారులు సమాచారాలతో హాజరు కావాలని కోరారు.

అగ్రిట్రేడ్ అధికారిణి వివరణ

ఆలమూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మార్కెటింగ్ నిధులతో లింక్‌రోడ్లుకు రెండేళ్ల క్రితమే (గత ప్రభుత్వ కాలంలో) ప్రతిపాదనలు పంపించినట్లు జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి తెలిపారు. రూ.54కోట్లుతో 99లింక్ రోడ్లుకు రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వ ఆమోదం కోసం పంపించామన్నారు. ఈఏడాది ఎటువంటి ప్రతిపాదనలు పంపించలేదని వివరించారు.

దీపావళికి ఉచితంగా బియ్యం, పంచదార

యానాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని ప్రజలకు దీపావళి సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్.రంగసామి కానుకను ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు 10కిలోల బియ్యం, 2కిలోల పంచదార ఉచితంగా అందజేయనుంది.

ఆహ్వాన పత్రిక అందజేత



ఆత్రేయపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల21 నుంచి 29వరకు తిరుమల తరహాలో నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, కమిషనర్‌కు బుధవారం గొల్లపూడిలో నల్లం చక్రధరరావు బ్రహ్మోత్సవ ఆహ్వాన శుభలేఖను అందజేశారు. బ్రహ్మోత్సవాలు నిర్వహణపై కమిషనర్‌కు ఆయన వివరించారు.

పిట్స్‌తో వృద్ధుడి మృతి



మండపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండపేట - ఆలమూరు రోడ్డులో గొల్లపుంతకాలనీకి చెందిన సోము వీర్రాజు(65) బుధవారం పిట్స్‌తో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం పట్టణంలోని గొల్లపుంతకాలనీకి చెందిన వీర్రాజు కాలనీలో పశువులు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కూమార్తెలు, కూమారుడు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కపిలేశ్వరపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కేదార్లంక గ్రామం శివారు వీధివారిలంకకు చెందిన వీది సూర్యప్రకాశరావు అదృశ్యంపై అంగర పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ డి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 8న వీది సూర్యప్రకాశరావు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని పోలీసులకు భార్య మాణిక్యాంబ ఫిర్యాదు చేసింది. కేసు విచారిస్తున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

మద్యం వ్యాపారులకు కృతజ్ఞతలు

ఆలమూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తూరు సెంటర్లో జనం రద్దీగా ఉండే ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని చేసిన విజ్ఞప్తిని గుర్తించి షాపును మరో ప్రాంతంలో ఏర్పాటు చేయడం పట్ల సంధిపూడి, పినపళ్ల, పెదపళ్ల, చింతలూరు, సూర్యారావుపేట సర్పంచ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తూరు సెంటర్ నుంచి సంధిపూడి వద్ద జనం నిత్యం రద్దీగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈగ్రామాలకు చెందిన పంచాయతీలు ఈ ప్రాంతంలో షాపు ఏర్పాటు చేయవద్దని తీర్మానం చేశారు. ఈమేరకు మంగళవారం ఆటోతో ప్రచారం చేయించారు. అయితే మొదట ఇదే రోడ్డులో బుధవారం ఉదయం షాపు ఏర్పాటు చేయడానికి సిద్ధం చేయగా సర్పంచ్‌లు, గ్రామస్థులు చేసిన విజ్ఞప్తి మన్నించి షాపును కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో ఏర్పాటు చేయకపోవడంతో వారు హర్షం వ్యక్తం చేసి మద్యం వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కారుపై విరిగి పడిన విద్యుత్ స్తంభం



యానాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యానాంలో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పలు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. వాతావరణంలో మార్పుల వల్ల ఉదయం నుంచి కొద్దిగా కొద్దిగా వర్షం కురుస్తున్నప్పటికి సాయంత్రం భారీ గాలులతో వర్షం కురవడంతో స్థానిక యర్రా గార్డెన్స్ మొదటి వీధిలో పలు చెట్లు విద్యుత్ స్తంభం అక్కడే ఉన్న కారుపై పడింది. దీంతో కారు పైభాగం పూర్తిగా పాడైపోయింది. రెండు గంటలు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు స్తంభాన్ని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.